ఈనాడు
అనంతపురం

మంగళవారం అక్టోబరు 22, 2024



గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీశ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



స్తూపం వద్ద జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్..

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: సమాజ భద్రత, రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా సాయుధ బలగాలు అతిథులకు గౌరవ వందనంతో స్వాగతం పలికాయి. అనంతరం పోలీసు త్యాగాలను గుర్తు చేసుకున్నారు. విధుల్లో అమరులైన పోలీసు కుటుంబాలకు సాయం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమన్నారు. సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పనిచేస్తూ ప్రాణాలు సైతం పణంగా పెడుతున్న పోలీసులకు ఇచ్చే పరిహారం రెట్టింపు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు సేవలు మరువలేనివని, ఏమిచ్చినా రుణం తీర్చుకోలేదన్నారు. డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ వారంలో రోజులపాటు ప్రజలు, విద్యార్థులకు పోలీసుల విధుల పట్ల అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. పోలీసుల నిబద్ధతపై చైతన్యం కల్పిస్తూ అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా, సీఐలు ధరణికిశోర్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సాయుధ బలగాలు

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు : ఎస్పీ

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా కార్యాచరణ, ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వివరాలు.. జిల్లాలో ఉన్న 42 పోలీసుస్టేషన్ల పరిధిలో సిబ్బందితో విస్తృత తనిఖీలు చేయించారు. మట్కా, స్థావరాలపై దాడులు నిర్వహించి 18 కేసులు నమోదు చేసి, 27 మందిని అరెస్టు చేశారు. రూ.3,31660 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదం స్థావరాలపై దాడులు నిర్వహించారు 23 కేసులు, 85 మందిని అరెస్టు చేసి, రూ.2,89,240 నగదు సీజ్ చేశారు. రోడ్డు భద్రత ఉల్లంఘనలపై 3,253 ఈ చలానాలు జారిచేసి, రూ.7,51,736 జరిమానాలు విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై దాడులు నిర్వహించి 373 మందిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు దేవాలయాలు, లాడ్జీలు, దాబాలు, ఏటీఎం భద్రత కోసం తనిఖీలు నిర్వహించినట్లు వివరించారు.


ప్రభుత్వ బడుల్లో



- మంజూరుకు నోచుకోని గ్రాంటు
- ప్రధానోపాధ్యాయులపై భారం

'అనంతపురం గ్రామీణ మండలంలో 125 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 89 ప్రాథమిక, 14 ప్రాథమికోన్నత, 24 ఉన్నత పాఠశాలలున్నాయి. సుమారు 18 వేల మంది విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చదువుతున్నారు. అన్ని పాఠశాలలకు కలిపి ఏడాదికి రూ.23 లక్షల గ్రాంటు మంజూరు కావాలి. రెండేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులపై భారం పడుతోంది.'

'శ్రీసత్యసాయి జిల్లాలోని కొత్తచెరువు మండలంలో 45 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. వాటిలో ప్రాథమిక 34, ప్రాథమికోన్నత 4, ఉన్నత పాఠశాలలు 7 ఉన్నాయి. వీటికి గ్రాంటు మంజూరు కాకపోవడంతో సుద్దముక్కలు కొనడానికి కూడా ఇబ్బందిగా మారింది.'



నిధులకు నిరీక్షణ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేసింది. నాడు-నేడు పథకానికి అరకొరగా నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకొంది. నాడు-నేడు పథకానికే కాకుండా పాఠశాల నిర్వహణకు కూడా ప్రతి సంవత్సరం నిధులు విడుదల చేయాలి. ఆ దశగా వైకాపా ప్రభుత్వం ఆలోచించలేదు. దీంతో పాఠశాల నిర్వహణ భారం ప్రధానోపాధ్యాయులపై పడుతోంది. వాస్తవానికి పాఠశాలల్లో సుద్దముక్కలు, బోర్డు తుడుపుగుడ్డలు, తెల్లకాగితాలు, రిజిస్టర్లు తదితర స్టేషనరీ కొనుగోలుకు పాఠశాల గ్రాంటు ప్రభుత్వం విడుదల చేస్తుంది. 100 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు రూ.10 వేలు, 100 నుంచి 250 మధ్య ఉంటే రూ.25 వేలు, 500 మంది విద్యార్థులుంటే రూ.50 వేలు, వెయ్యికి లోపుంటే రూ.75 వేలు, వెయ్యి దాటితో రూ.లక్ష చొప్పున ఈ గ్రాంటు మంజూరు చేయాలి. మూడేళ్ల నుంచి నిధులు రాకపోవడంతో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏడాదికి రూ.లక్ష చొప్పున ఖర్చు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రధానోపాధ్యాయులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



చదువుకుంటున్న విద్యార్థులు

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి అనంత జిల్లాలో 2023-24, 2024-25 సంవత్సరంలో ఒక్క రూపాయి కూడా పాఠశాల గ్రాంటు రాలేదు. 2022-23లో కేవలం 25 శాతం నిధులు వచ్చాయి. సుమారు రూ.6 కోట్ల నిధులు ఉమ్మడి జిల్లాకు ఏటా విడుదల కావాల్సి ఉంది. పాఠశాలల్లో పెద్ద పెద్ద మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. 25 శాతం మొదటి విడతలో విడుదల చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ నిధులపై స్పష్టత రావాల్సి ఉంది.

నేరుగా బడులకే పంపిస్తాం

- నాగరాజు, ఏసీపీ, సమగ్రశిక్షా, అనంతపురం

రెండేళ్ల ముందు 25 శాతం నిధులు వచ్చాయి. ఆ తరువాత నిధులు రాలేదు. ఈ సంవత్సరం నిధులు మంజూరవుతున్నట్లు తెలిసింది. రాష్ట్రవిద్యాశాఖ నుంచి నేరుగా పాఠశాలలకు ఆన్‌లైన్‌లో నిధులు విడుదల చేస్తారు. లేదా ఎస్ఎస్ఏ కార్యాలయానికి నిధులు వస్తే వెంటనే ప్రధానోపాధ్యాయుల ఖాతాకు పంపిస్తాం.



మాట్లాడుతున్న వెంకటశివుడుయాదవ్, దగ్గుపాటిప్రసాద్ తదితరులు

ఐదేళ్లుగా వ్యవసాయ రంగం కుదేలు


ఇష్టారాజ్యంగా మద్యం, ఇసుక దోపిడీ

రాంనగర్(అనంతపురం) న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ధ్వజమెత్తారు. రైతుల గురించి మాట్లాడే కనీస అర్హత కూడా వైకాపా నాయకులకు లేదని మండిపడ్డారు. సోమవారం జిల్లా తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్న సమయంలో ఏ రోజైనా రైతులను పట్టించుకున్నారా? రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా అంటూ నిలదీశారు. అనంత జిల్లాలో గత 2014-16 మధ్య కాలంలో పంటనష్ట పరిహారం కింద రూ.1,599.76 కోట్లు, 2015, 2016లో పంటలబీమా కింద రూ.574 కోట్లు రైతులకు, గత తెదేపా హయాంలో బిందుసేద్యం 1,29,089 హెక్టార్లకు రూ.978 కోట్లు ఖర్చు చేశామన్నారు. 2024 ఏడాదికి జిల్లాకు రూ.37,500 హెక్టార్లకు డ్రిప్ మంజూరు చేశారని, రాష్ట్రంలోనే అనంతపురం జిల్లాకు చంద్రబాబు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. వాస్తవాలు తెలుసుకుని అనంతవెంకట్రామిరెడ్డి మాట్లాడాలని వారు హితవు పలికారు. మరోవైపు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై వారు మండిపడ్డారు.

పనులు చేయకనే ఉపాధి నిధులు స్వాహా?

● కూలీల పేరుతో రూ.45.46 లక్షలు దుర్వినియోగం ● రూ.9.67 లక్షలు పక్కదారి పట్టినా వసూలు చేయని వైనం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: లక్ష.. రెండు లక్షలు కాదు. ఏకంగా రూ.9.67 లక్షలు స్వాహా చేశారు. పనులే చేయకుండానే.. చేసినట్లు బోగస్ పత్రాలు, ఎం.బుక్కులు సృష్టించి ఉపాధి సొమ్మును పక్కదారి పట్టించారు. ఈ అవినీతి వ్యవహారం సాక్షాత్తు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కమిషనర్(సీఆర్‌డీ) ఆదేశించినా నయాపైసా రికవరీ చేయలేదు. సరికదా.. సమగ్ర విచారణ చేయకుండా అటకెక్కించారు. కుందుర్పి మండలం తెనగల్లు పంచాయతీ గ్రామీణ 'ఉపాధి' హామీ పథకం అమలులో దందా జరిగింది. ఈమేరకు రామాంజినేయులు అనే రైతు.. అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అక్రమాలు చేసింది నిజమేనని స్వయంగా డ్వామా కళ్యాణదుర్గం సహాయ పథక సంచాలకుడు (ఏపీడీ) రమేశ్ నాయక్ ప్రాథమిక విచారణలో నిగ్గు తేల్చారు.



రామాంజినేయులు, బాధిత రైతు

నకిలీ దస్త్రాలు సృష్టించి..

కుందుర్పి మండలం తెనగల్లులో ఏడుగురు రైతుల పొలాల్లో సరిహద్దు కందకాలు (బౌండ్రీ ట్రెంచ్) తవ్వినట్లు అక్కడి క్షేత్ర సహాయకుడు(ఎఫ్ఏ) రవిచంద్రారెడ్డి నకిలీ దస్త్రాలు సృష్టించాడు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అక్రమానికి తెర లేపారు. ఏడుగురు రైతుల పొలాల్లో కందకాలు తవ్వినట్లు రూ.9,66,805 పక్కదారి పట్టించారు. ఏడుగురిలో ఒకరైన రామాంజినేయులు.. తమ పొలంలో అసలు కందకాలే తవ్వలేదంటూ మే నెలాఖరులో కుందుర్పి ఎంపీడీఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గత పీడీకి సైతం ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు చేశారు. కలెక్టర్‌కు అర్జీ ఇచ్చిన తర్వాత ప్రాథమిక విచారణ సాగింది. ఈక్రమంలో అవినీతి నిజమేనని తేలింది. రూ.9.67లక్షలు రికవరీ చేయాలని కలెక్టర్ ఆదేశించినా ఫలితం శూన్యం. దీంతో గతనెల 13న రాష్ట్ర మంత్రి లోకేష్‌కు సదరు రైతు ఫిర్యాదు చేశారు. అప్పటికపుడు కలెక్టర్, సీఆర్డీకి ఈ ఫిర్యాదుపై మాట్లాడారు.

దోచేసినా..

ఏడుగురి రైతుల పొలాల్లో కందకాల రూపంలో దోచేయగా... అసలు 'ఉపాధి' పనికే వెళ్లని 52 మంది కూలీల పేర్లతో గడిచిన ఐదేళ్లు రూ.45.46 లక్షలు దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అక్కడి ఏపీడీ సైతం తన విచారణలో పేర్కొన్నారు. ఓ అంగన్‌వాడీ టీచరుకు జాబ్‌కార్డు ఉంది. ఆమె పనికి వెళ్లినట్లు రూ.22,392.81 బిల్లు పొందారు. శాశ్వత వలస వెళ్లిన వారి పేర్లతోనూ కూలీ డబ్బులు తినేశారు. 17వ సామాజిక తనిఖీలోనూ పేర్కొన్నారు. ఇంత జరిగినా ఏదీ రికవరీ చేయలేదు. గత వైకాపా ప్రభుత్వ హయంలో 'ఉపాధి'లో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు తేటతెల్లమవుతోంది.

ఐదేళ్లలో తాగునీటి పథకాలన్నీ నిర్వీర్యం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే : ఐదేళ్లల్లో వైకాపా ప్రభుత్వం పీఏబీఆర్ వద్ద ఉన్న తాగునీటి పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. నీటి పథకాల విషయంలో దుర్మార్గాన్ని ప్రదర్శించిందన్నారు. సోమవారం ఆయన కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద శ్రీరామరెడ్డి, కూడేరు, ఉరవకొండ తాగునీటి పథకాలను జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఉరవకొండ మండలం ఇంద్రావతి హంద్రీనీవా కాలువ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండ తాగునీటి పథకానికి సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల నుంచి నీరు సరఫరా అవుతోందన్నారు. సత్యసాయి పథకంలో రెండు మోటార్లకు ఒకటి, శ్రీరామరెడ్డి పథకంలో రెండు మోటార్లకు గాను రెండు పని చేయడం లేదన్నారు. కూడేరు పథకంలోని మోటారు ద్వారా నీటిని అందిస్తున్నారన్నారు. వీటితో పాటు కొంత మేర పైపులైన్లు, రాపిడ్ శాండ్ ఫిల్టర్‌లో ఇసుక పాడయ్యిందన్నారు. విద్యుత్తు నియంత్రికలు, మోటార్ల వద్ద విద్యుత్తు పరికరాలను, శుద్ధి జరిగిన నీటిని తోడే ప్రదేశంలో 1000 హెచ్‌పీ మోటార్‌ను, ఫిల్టర్ బెడ్‌లను మార్చాల్సి ఉందన్నారు. ఉరవకొండకు ఐదేళ్లుగా కలుషిత నీటినే సరఫరా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మోటార్లను మార్చడంతో పాటు, ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభిస్తామన్నారు.



పీఏబీఆర్‌లో పనిచేయని మోటార్ల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి పయ్యావుల కేశవ్

రూ.62 కోట్లతో తాగునీటి ప్రత్యామ్నాయ వ్యవస్థ

ఉరవకొండతోపాటు మరిన్ని పల్లెలకు నీటిని అందించే నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకులను హెచ్ఎల్‌సీలోని తుంగభద్ర జలాలతో నింపుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఆ నీరు ఏటా ఫిబ్రవరి నాటికి బంద్ అవుతాయన్నారు. దీంతోనే నీటి సమస్య తలెత్తుతోందన్నారు. దీన్ని అధిగమించడానికి ఉరవకొండ మండలం ఇంద్రావతి వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ప్రత్యామ్నాయంగా ఆ ఎస్ఎస్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో తాగునీటి వ్యవస్థను మెరుగు పరచడానికి రూ.62 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. రెండేళ్లలో ప్రతి పల్లెలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తామని ఉద్ఘాటించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీధర్, డీఈఈ అంజుమన్, ఏఈఈ ఐజయ్య, సత్యసాయి తాగునీటి పథకం డీఈఈ రామారావు, తహసీల్దారు మహబూబ్ బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రేవులపై నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో అదనంగా ఏర్పాటు చేయాల్సిన ఉచిత ఇసుక రేవుల ఏర్పాటుపై నిర్లక్ష్యం ప్రదర్శించొద్దు. సత్వరమే ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రారంభించాల్సిందేనని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా బాధితుల నుంచి అర్జీలను తీసుకున్నారు. కలెక్టర్‌తోపాటు జేసీ శివనారాయణ శర్మ, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, జెడ్పీ ఉమామహేశ్వరమ్మ, డీపీఓ నాగరాజు, తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 363 అర్జీలు అందాయి. యల్లనూరు, రుచ్చుమర్రిలో ఇసుక రేవులు ప్రారంభించాలని ఇదివరకే ఆదేశించినా ఆచరణలో అమలు కాలేదు. ఇక జాప్యం చేయొద్దని గనులశాఖ డీడీని ఆదేశించారు. సహకార సంఘాలల్లో కంప్యూటరైజేషన్ ఈనెల 31 లోపు పూర్తి కావాలన్నారు.

● గ్రామ సచివాలయాల వ్యవస్థను పూర్తిగా గ్రామ పంచాయతీలోకి విలీనం చేసి.. సర్పంచుల ఆధీనంలోకి తేవాలని ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూషణనాయుడు, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి కలెక్టర్‌కు వినతి అందజేశారు. గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటే రాజ్యాంగం విరుద్ధం. పంచాయతీల్లో విలీనం చేయాలని సర్పంచులు దేగల లలితమ్మ, ఇస్మాయిల్, ఆజాద్, నాగార్జున, రాజు, శివశంకర్‌రెడ్డి, పెద్దన్న, శీనయ్య, వసంత్, కుళ్లాయప్ప, తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు.

● కూడేరు మండలం కరుట్లపల్లి దళితులకు శ్మశాన వాటిక చూపకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాల్లో మృతదేహాలను ఖననం చేస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హెచ్చరించారు. ఆ గ్రామ సర్పంచి ఓబుళమ్మ, దళితులతో కలిసి ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. సత్వరమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

● డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వైద్య సేవ పొరుగు, ఒప్పంద ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగార్జున, రామాంజనేయులు, తదితరులు కలెక్టర్‌ను కోరారు. ఇప్పటికే అనేక దఫాలుగా వినతులు అందించాం. ఈనెల 29వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని తెలిపారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సర్పంచుల సంఘం నాయకులు దేగల కృష్ణమూర్తి, భూషణనాయుడు

కాల్పుల ఘటనలో పోలీసులకు కీలక సమాచారం!

అదుపులో షికారీపాలెం ముఠా సభ్యుడు

ధర్మవరం, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన తుపాకీ కాల్పుల ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాల్పుల ఘటనలో పాల్గొన్న, పరారైన వారిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఘటన అనంతరం పరారైన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా కీలక సమాచారం తెలిసింది. అతను అన్నమయ్య జిల్లా షికారీపాలెం చెందిన బంగారీగా గుర్తించారు. షికారీపాలెం చెందిన ఐదుగురు యువకులు ముఠాగా ఏర్పడి గుప్తనిధులు దొరికాయని, తమ వద్ద బంగారు నాణేలు ఉన్నాయని, వాటిని తక్కువ ధరకే ఇస్తామని ఎరవేసి, నకిలీ నాణేలు ఇచ్చి నగదు తీసుకుని మోసం చేస్తున్నట్లు విచారణలో తెలిసింది.

బంగారం ముక్క ఎరవేసి..

ముఠా సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. తక్కువ ధరకే తమ వద్ద ఉన్న బంగారు నాణేలు ఇస్తామని అతనికి వారు చెప్పారు. కదిరికి రప్పించి బంగారు నాణేల కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని ముఠా సభ్యులు బేరం పెట్టారు. నాణేలకు సంబంధించిన కొంత ముక్క ఇచ్చి పరీక్షించుకోవాలని వారు నమ్మబలికారు. దాన్ని తీసుకెళ్లిన హైదరాబాద్ వ్యక్తి మళ్లీ రాకపోవడంతో వారు అతనికి పదే పదే ఫోన్ చేసి రూ.4 లక్షలకే బంగారు నాణేలు అప్పచెబుతామని చెప్పారు. అప్పటికీ అతను ఆసక్తి చూపకపోవడంతో రూ.2 లక్షలకే ఇస్తామని మరోసారి ఫోన్ చేశారు. దీంతో హైదరాబాద్ వాసి తకు ఇచ్చిన బంగారు నాణెం ముక్క పరీక్ష చేయించగా అసలు బంగారమని తేలింది.

కాల్పులు హైదరాబాద్ ప్రాంత వాసుల పనే..?

హైదరాబాద్ చెందిన వ్యక్తి తనకు తెలిసిన కొందరు నగర సైబర్ క్రైం పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. నకిలీ బంగారు నాణేలు కట్టబెట్టి డబ్బు తీసుకెళ్లేందుకు షికారీపాలెం ముఠా పథకం వేసిందనే విషయాన్ని అతనికి వారు అవగాహన కల్పించారు. తెలంగాణ ప్రాంతాల్లో పలువురు ఆ ముఠా సభ్యుల చేతుల్లో మోసపోయినట్లు తెలిసింది. ఒప్పందం కుదుర్చుకున్న మేరకు హైదరాబాద్ వ్యక్తికి బంగారు నాణేలు ఇచ్చేందుకు ఆదివారం ముఠా సభ్యులు రామాపురం వద్దకు వచ్చారు. కారులో వచ్చిన హైదరాబాద్ వ్యక్తి ముఠా సభ్యులతో మాట్లాడుతుండగా మరో వాహనంలో వచ్చిన, హైదరాబాద్ చెందిన ముగ్గురు తుపాకులు బయటకు తీసి గాల్లో కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు పట్టుకునేందుకు వచ్చారని ముఠా సభ్యులు ద్విచక్ర వాహనాల్లో తప్పించుకెళ్లారు. ఈ దశలో వారు తమ వద్ద ఉన్న నకిలీ బంగారు నాణేల సంచి పడేసి వెళ్లారు. వారి నుంచి తప్పించుకునే క్రమంలో ముఠా సభ్యుడు బంగారీ బత్తలపల్లి వైపు వెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామాపురం కాల్పుల ఘటనపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులతోనూ శ్రీసత్యసాయి జిల్లా పోలీసు అధికారులు మాట్లాడారు.

కాలుష్య కోరల్లో పెన్నమ్మ

నదిలోకి మురుగు ప్రవాహం

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, తాడిపత్రి: వరద నీటితో కళకళలాడాల్సిన పెన్నానది మురుగు కలుస్తోంది. తాడిపత్రి పురపాలికకు తాగునీరు అందించే నది కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. మురుగు కలుస్తున్న ప్రదేశంలోనే రక్షిత మంచినీటి పథకాల బోర్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నదిలో నిత్యం మురుగు ప్రవాహంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. మరోవైపు తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుండటంతో నది సమీపంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నదికి ఆనుకుని ఉన్న బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు సైతం అవస్థలు పడుతున్నారు. అక్కడి పార్కులో ఉదయం, సాయంత్రం నడకకు వచ్చేవారు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.

గత పాలకుల పాపమే..

తాడిపత్రిలో మురుగు శుద్ధి కోసం రెండు కేంద్రాలను 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. సీపీఐ కాలనీ సమీపాన 8 ఎంఎల్‌డీ సామర్థ్యంతో, ఔటర్ బైపాస్ సమీపంలో 3.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. పురపాలిక పరిధిలోని కాలువలను వాటితో అనుసంధానం చేశారు. 2019 వరకు పట్టణంలోని మురుగును ఈ రెండు కేంద్రాల్లో శుద్ధి చేసి పొలాలకు అందించేవారు. అక్కడి ప్రైవేటు స్టీల్‌ప్లాంట్‌కు సరఫరా చేసి సంవత్సరానికి రూ.10 లక్షల వరకు ఆదాయం పొందేవారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక కేంద్రాల నిర్వహణను గాలి కొదిలేశారు. నందలపాడు, ఓంశాంతి నగర్, గాంధీనగర్, బంకమడివీధి కాలనీల నుంచి వెళ్లే ప్రధాన పైపులైన్లు దెబ్బతిన్నా ఐదేళ్ల పాటు మరమ్మతు చేయించలేదు. మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మరమ్మతులు చేయించడానికి చర్యలు చేపట్టగానే అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు గుత్తేదారుపై దాడి చేశారు. దీంతో మరమ్మతు పనులు నిలిచిపోయాయి. ఫలితంగా మురుగును పెన్నానదిలోకి వదులు తున్నారు.



బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో పెన్నాలో కలుస్తున్న మురుగు

నిత్యం 40 లక్షల లీటర్లు..

తాడిపత్రి పురపాలిక పరిధిలో జనాభా 2 లక్షలు. వార్డులు 36 ఉన్నాయి. రోజూ సుమారు 11.5 ఎంఎల్‌డీ మురుగు వస్తోంది. నందలపాడు, ఓంశాంతినగర్, గాంధీనగర్, బంకమడివీధి కాలనీల మురుగు నదిలోకి వెళుతోంది. నిత్యం 40 లక్షల లీటర్ల మురుగు కలుస్తున్నట్లు అధికార వర్గాలే చెబుతున్నాయి. పెన్నాలో ఏర్పాటు చేసిన 23 బోర్ల నుంచి నిత్యం 8 ఎంఎల్‌డీ తాగునీరు తాడిపత్రి పట్టణానికి అందిస్తున్నారు. మురుగు కలుస్తున్న ప్రాంతంలోనే 15 మంచినీటి బోర్లు ఉన్నాయి. తాగునీటి సంపు 50 మీటర్ల దూరంలోనే ఉంది. ఫలితంగా తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెలకువలతో నాణ్యమైన బోధన అందించండి: ఆర్జేడీ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శిక్షణలో నేర్చుకొన్న మెలకువలతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు (ఆర్జేడీ) శామ్యూల్ పేర్కొన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల ప్రాథమిక ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావాల్సిందేనన్నారు. 6 రోజులపాటు జరిగే శిక్షణలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తెల్లవారుజామున యోగాతో శిక్షణ కార్యక్రమం ఆరంభమవుతుందన్నారు. వ్యక్తిత్వ వికాసంతో పాటు, విద్యార్థులతో ఎలా మెలగాలి, ఏ విధంగా బోధించాలనే విషయాలను నిపుణులు వివరిస్తారన్నారు. బోధనకు అన్నివిధాలుగా తీర్చిదిద్దుతారన్నారు. నేర్చుకొన్న అంశాలు పాఠశాలలో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు మల్లికార్జున, ఏపీసీ నాగరాజు, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు సీఎం కృషి

రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ - 17 వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర, ఏపీ శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు తదితరులు, తలపడుతున్న క్రీడాకారులు

హిందూపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా మైదానాలు, శిక్షణ కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చి రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర పేర్కొన్నారు. సోమవారం హిందూపురం పట్టణం ముద్దిరెడ్డిపల్లిలో 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్ 17 వాలీబాల్ పోటీలను రాష్ట్ర శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడుతో కలిసి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం 13 జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొన్న బాల, బాలికల జట్ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సతీమణి, ఏపీ శ్యాప్ ఛైర్మన్ మాట్లాడుతూ అవసరమైన శిక్షకులను ఏర్పాటుచేసి ప్రభుత్వం క్రీడలపట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తోందన్నారు. 2027లో రాష్ట్రంలో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించే దిశగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకొంటున్నారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితో ముద్దిరెడ్డిపల్లిలో క్రీడా మైదానం మంజూరు చేశారన్నారు. ఎంజీఎం పాఠశాలలో అర్ధంతరంగా ఆగిన ఇండోర్ స్టేడియం పూర్తికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. డీఎస్‌డీవో ప్రభుకుమార్, సుమిత్ర, ఎంఈవో ఏహెచ్ గంగప్ప, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తి, పరిశీలకుడు రమణ, ఎస్‌జీఎఫ్ మొరార్జీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేశ్, జిల్లా తెదేపా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజే హోరాహోరీగా..

అనంతపురం- కర్నూలు బాలుర జట్లు తలపడగా అనంతపురం విజయం సాధించింది. నెల్లూరు, చిత్తూరు బాలుర జట్లమధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు గెలవగా బాలికల విభాగంలో శ్రీకాకుళం, చిత్తూరు జట్లు తలపడగా చిత్తూరు గెలుపొందింది.

వైకాపా భూ ఆక్రమణలకు హద్దే లేదు: పరిటాల సునీత


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆర్డీఓ

రామగిరి, న్యూస్‌టుడే: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలకు హద్దే లేకుండాపోయిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం రామగిరి మండల కేంద్రంలో సోమవారం రెవెన్యూ సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ధర్మవరం ఆర్డీఓ మహేష్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ నరేష్‌బాబు, మండల రెవెన్యూ అధికారులతో కలసి ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి 185 వినతులు వచ్చాయి. వీటిలో అధిక సంఖ్యలో వైకాపా ప్రభుత్వ బాధితులు ఉన్నట్లు తెలిపారు.

గిరిజన సంక్షేమ శాఖ, అనంతపురం జిల్లా
షార్ట్ టెండర్ నోటీసు
ఆర్.సి.నెం. డి/438995/2024, తేది: 21-10-2024

2024-2025 విద్యా సంవత్సరమునకు అనంతపురం జిల్లా నందు నిర్వహించబడుచున్న ఈ క్రింద కనపరచిన గురుకుల పాఠశాలలకు కావలసిన వంట సరుకులు, గ్రుడ్లు, కూరగాయలు, పాలు, చికెన్, పండ్లు మరియు ఇతరములు సరఫరా చేయుటకు టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

1) ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల (బాలికలు) అనంతపురము.
టెండర్: వంట సరుకులు, గ్రుడ్లు, కూరగాయలు, పాలు, చికెన్, పండ్లు
సంప్రదించవలసిన వారి ఫోన్ నెం. 9177603330, 6303530436.
2) ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల కళాశాల (బాలుర) గొల్లలదొడ్డి.
టెండర్: సరుకులు, గ్రుడ్లు, కూరగాయలు, పాలు, చికెన్, పండ్లు
సంప్రదించవలసిన వారి ఫోన్ నెం. 9885369079, 8978239363.
3) ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల (బాలుర) బి.కె.సముద్రము
టెండర్: సరుకులు, గ్రుడ్లు, కూరగాయలు, పాలు, చికెన్, పండ్లు
సంప్రదించవలసిన వారి ఫోన్ నెం. 9948100343, 6300399741.
4) ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల (బాలికలు) ఉరవకొండ.
టెండర్: సరుకులు, గ్రుడ్లు, కూరగాయలు, పాలు, చికెన్, పండ్లు
సంప్రదించవలసిన వారి ఫోన్ నెం. 9110319981, 8555042696.
5) ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల (బాలుర) రాగులపాడు.
టెండర్: సరుకులు, గ్రుడ్లు, కూరగాయలు, పాలు, చికెన్, పండ్లు
సంప్రదించవలసిన వారి ఫోన్ నెం. 8008134805, 9550330009.
6) ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల (బాలికలు) కళ్యాణదుర్గం.
టెండర్: సరుకులు, గ్రుడ్లు, కూరగాయలు, పాలు, చికెన్, పండ్లు
సంప్రదించవలసిన వారి ఫోన్ నెం. 9963205664, 9603677505.

ఆసక్తిగల టెండరుదారులు ఒక్కొక్కటికి రూ. 1500/- చెల్లించి సంబంధిత ప్రిన్సిపల్స్ వద్ద నుండి పొందగలరు. **టెండరు ఆఖరు తేదీ: 29-10-2024 సాయంత్రము 5.00 గంటల వరకు. టెండర్ తెరచు తేదీ: 4-11-24 ఉదయం 10.00 గంటలకు** జాయింట్ కలెక్టర్ వారి ఛాంబర్, కలెక్టర్ కార్యాలయము, అనంతపురము. పూర్తి వివరములకు సంబంధిత ప్రిన్సిపల్స్‌ను సంప్రదించగలరు.

సం/- సంయుక్త కలెక్టర్/ ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటి

ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఖుష్బు కొఠారి తెలిపారు. ముందుగా ఈనెల 21వ తేదీ వరకు గడువు విధించగా విద్యార్థుల సౌకర్యం కోసం మరో అవకాశం కల్పించామన్నారు. అర్హులైనవారు జ్ఞానభూమి వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASMECC-(61058), అనంతపురం-515001.

A/c No.s: 1) 62505943576 (H/L), 2) 62505944536 (Suraksha), 3) 38325131581 (ABL)

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
సదరుచట్టం రూల్ 8(1) మరియు (2) క్రింద అనుబంధం IV

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECC, అనంతపురము అధీకృత అధికారియగు దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, **రుణగ్రహీత శ్రీ దండు ప్రసాద్ తండ్రి డి. కుల్లాయప్ప, డి.నం.4-125, శివాలయం రోడ్డు, చిన్మయనగర్, అనంతపురము** వారికి **14-08-2024** తేదీగల డిమాండ్ ప్రకటన జారీచేసి, సదరు ప్రకటనలో తెలిపిన మొత్తం **1) 14.08.2024 నాటికి రూ.15,53,531/- (పదిహేను లక్షల యాభైమూడు వేల ఐదువందల ముప్పైఒక్క రూపాయలు మాత్రమే), 2) 14.08.2024 నాటికి రూ.22,484/- (ఇరవైరెండు వేల నాలుగువందల ఎనభైనాలుగు రూపాయలు మాత్రమే), 3) 14.08.2024 నాటికి రూ.13,10,304/- (పదమూడు లక్షల పది వేల మూడువందల నాలుగు రూపాయలు మాత్రమే)** + 15.08.2024 నుండి కాంట్రాక్చువల్ రేటు వంతున వడ్డీ తదుపరి వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలగువాటిని సదరు ప్రకటన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాలని కోరారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **16.10.2024**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు/ హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను/ హామీదారులను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం **1) 14.08.2024 నాటికి రూ.15,53,531/-** (పదిహేను లక్షల యాభైమూడు వేల ఐదువందల ముప్పైఒక్క రూపాయలు మాత్రమే), **2) 14.08.2024 నాటికి రూ.22,484/-** (ఇరవైరెండు వేల నాలుగువందల ఎనభైనాలుగు రూపాయలు మాత్రమే), **3) 14.08.2024 నాటికి రూ.13,10,304/-** (పదమూడు లక్షల పది వేల మూడువందల నాలుగు రూపాయలు మాత్రమే) మరియు 15.08.2024 నుండి కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ.వి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECC, అనంతపురము చార్జికు లోబడి ఉంటాయి.

షెడ్యూలు ఆస్తి వివరణ

ఆస్తి అనంతపురము పరసనాయపల్లి పంచాయతీ ఏరియా, రాప్తాడు గ్రామ పొలం పరిధిలోని అనంతపురము ఆర్‌డి & ఎస్‌ఆర్‌డి వద్ద ఉంది. ఈ ఆస్తి రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.1884/ 2010, తేది: 25-03-2010 ప్రకారం డి. ప్రసాద్ తండ్రి డి. కుల్లాయప్పకు చెందినది.

బాబు	సర్వే నం.	A.C	A.C	A.C	H.S	D.No.
ప్రభుత్వ ఖుష్కి	76/1	7.04 పైకి	1.49 పైకి	0.04.75	0.19	5/66

సరిహద్దులు: తూర్పు: అచ్యుతరావుకు చెందిన ప్లాట్, **పశ్చిమం:** సుంకిరెడ్డికి చెందిన ప్లాట్, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** ఆదిశేషయ్యకు చెందిన ప్లాట్

కొలతలు:తూర్పు-పశ్చిమం: 27 అడుగులు లేదా 8.27 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం:**78 అడుగులు లేదా 23.63 మీటర్లు, **మొత్తం విస్తీర్ణం: 4.75 సెంట్లు**

తేది : 16.10.2024
ప్రదేశం : అనంతపురము

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,అనంతపురము.


నీటి ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ ధ్వజం


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, చిత్రంలో సీనియర్ నాయకుడు ఓబులు, జిల్లా కార్యదర్శి రాంభూపాల్ తదితరులు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: 'సీమ జిల్లాల సాగునీటి ప్రాజెక్టులపై అనాది కాలం నుంచి పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వారి స్వార్థపూరిత రాజకీయాల మూలంగా అన్నదాతలు అన్యాయం అవుతున్నారు. కరవు ప్రాంతాలు సస్యశ్యామలం కావాలంటే తుంగభద్ర, కృష్ణా జలాలే ఏకైక మార్గం' అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. 'నీటి వనరులు.. ఆయకట్టు రైతుల వ్యథలు'పై అధ్యయనం చేసేందుకు ఈనెల 15 నుంచి 19వ తేదీ దాకా సీపీఎం ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించారు. ఆఖరుగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గఫూర్ మాట్లాడుతూ ఈ ప్రాంత నాయకులు అనేకమంది సీఎంలైనా న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. ఏ పార్టీ ప్రభుత్వం అన్నది కాదక్కిడ. ప్రతి ప్రభుత్వం సీమ జిల్లాలపై తగిన శ్రద్ధ చూపలేదన్నారు. సీపీఎం రాష్ట్ర నేత ఓబులు మాట్లాడుతూ 2008లో హెచ్చెల్సీ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టినా ఇప్పటికీ అతీగతీలేదు. పాలకుల వైఖరి, వారి స్వార్థ రాజకీయాలే దీనికి కారణమన్నారు. జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువల ఆధునికీకరణతోపాటు ఉంతకల్లు జలాశయం, పీఏబీఆర్, ఎంపీఆర్, చాగల్లు, పేరూరు, భైరవానితిప్ప, సుబ్బరాయసాగర్.. వంటి జలాశయాలను ఆధునికీకరించాలన్నారు. ప్రతి చెరువుకు నీరు ఇవ్వాలని డిమాండు చేశారు. ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, బాలరంగయ్య, సావిత్రి, నాగేంద్ర, శ్రీనివాసులు, రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు మాట్లాడారు. అంతకముందు నగరంలో ర్యాలీ జరిపారు. ఆఖరుకుగా కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి అందజేశారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య


మధు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : కనుంపల్లి గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన మధు(28) అనే యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన మధు రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులకు చరవాణి ద్వారా వస్తున్నానని సమాచారమిచ్చాడు. సోమవారం యువకుడి మృతదేహం ఉన్న విషయం పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై గౌస్‌బాషా పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పురుగుమందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడని ధ్రువీకరించారు. మృతుడికి పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరుకు చెందిన అనితతో వివాహం జరిగింది. వీరికి సంతానం కలగకపోవడంతో అనంతపురంలోని ఓ వైద్యుడి దగ్గర చికిత్స చేయించుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలుస్తాయని సీఐ కౌలుట్లయ్య, ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

అనారోగ్యంతో వివాహిత..

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని గుప్తాకాలనీలో నివాసముంటున్న అపర్ణ(32) అనే వివాహిత సోమవారం బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల వివరాల ప్రకారం అపర్ణ దంపతులు కొంతకాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. ఈక్రమంలో అపర్ణ తీవ్ర ఒత్తిడికి లోనైన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాడి రైతులకు కూటమి సర్కారు అండ

పశు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరుకు శ్రీకారం


దామోదర్‌రెడ్డి, పాడి రైతు, ఆర్.కొత్తపల్లి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పాడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు పశు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఈ కార్డుతో రుణాలు పొంది పశువులను, దాణా, మేత, మందులు కొనుగోలు చేయవచ్చు. రైతుల అవసరాలకు సకాలంలో చేతిలో డబ్బు ఉండదు. అధిక వడ్డీలకు బయట తీసుకోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవటానికి ప్రభుత్వం కార్డుల మంజూరుకు చర్యలు తీసుకొంది. జిల్లాలో 5వేల మందికి ఈ కార్డులు మంజూరు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. గతంలోనే ఈ పథకం ఉన్నా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు తీసుకున్నా బ్యాంకర్లు కొంత మందికే కార్డులు మంజూరు చేసి మమ అనిపించారు.

ఇవి ప్రయోజనాలు: పంట రుణం తీసుకున్న రైతులకే బ్యాంకర్లు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తారు. పాడిరైతు పశువైద్యాధికారి గుర్తింపు పత్రాన్ని బ్యాంకరుకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కార్డు ద్వారా గరిష్ఠంగా రూ.3లక్షల దాకా రుణం మంజూరు చేస్తారు. రూ.1.60లక్షల దాకా ఎలాంటి పూచీకత్తు అవసరం ఉండదు. రుణాన్ని 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే 7శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోపు క్రమం తప్పకుండా చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చెరో 3 శాతం చొప్పున వడ్డీ రాయితీ ఇస్తాయి. మిగిలిన ఒక శాతం రైతులు చెల్లిస్తే సరిపోతుంది. కార్డుల కోసం పాడిరైతులు దరఖాస్తులు చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు జి.పి.వెంకటస్వామి తెలిపారు.

జిల్లాలో పశు సంపద వివరాలు (లక్షల్లో)

ఆవులు	2.16
గేదెలు	1.90
గొర్రెలు	22.94
మేకలు	4.12
పశువులు	5.27

సమస్య-సమాధానం


నజీరుద్దీన్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రబీ పంటల సాగులో రైతులకు ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త నజీరుద్దీన్ 99665 05285 నంబరుకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

సమస్య: మిరప తోటకు ఆకుముడత తెగులు సోకింది. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. - **నాగరాజు(రెడ్డిపల్లి)**

సమాధానం: ఎకరాకు ప్రిఫోనిల్ 400 మి.లీ లేదా డైపెనిథియోరాన్ 300 గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు ఉధృతిని అరికట్టవచ్చు.

సమస్య: ఎకరా విస్తీర్ణంలో కాకర పంటను పందిరి పద్ధతిలో సాగు చేశా. పంటకు బూజు తెగులు ఆశించి ఆకులు ముడుచుకొని పోతున్నాయి. నివారణ చర్యలు తెలుపండి.
- **శంకరయ్య(బి.పప్పూరు)**

సమాధానం: కాకర పంటలో బూజు తెగులు నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ మందును 2 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

టమాటా రైతు పంట పండింది

కర్ణాటక మార్కెట్‌కు తరలింపు



రైతేరాజు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: కదిరి మండలంలోని వీరేపల్లిపేటకు చెందిన రైతు వెంగమునిరెడ్డి టమాట పంట సాగు చేసి రూ.14లక్షల వరకు ఆర్జించారు. తనకున్న 12 ఎకరాల్లో 6ఎకరాలు అరటి, ఒకటిన్నర ఎకరాలో టమాటా పంట సాగు చేశారు. గత జులైలో ముదిగుబ్బలోని నర్సరీ నుంచి సాహో రకానికి చెందిన 14వేల టమాటా మొక్కలను ఒక్కోటి 80పైసలతో కొని తెచ్చి నాటారు. వర్షాలకు పొలంలో నీరు నిలిచినా కాయ దెబ్బతినకుండా కట్టెల సాయంతో తీగ కట్టించారు. మొక్కలు నాటినప్పట్నుంచి తెల్లదోమ, కాండం తెగుళ్లు, నల్లమచ్చ, ఆకుముడత, ఎర్రనల్లి, కాయ కుళ్లు తెగుళ్లు వ్యాపించాయి. ఉద్యాన అధికారుల సూచనలతో నిత్యం మందులు పిచికారీ చేశారు. డ్రిప్పు ద్వారా మందులు వదిలి తెగుళ్లను అరికట్టారు. రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అందులో ఎరువులు, మందులకే సుమారు రూ.2లక్షలు ఖర్చయ్యింది.


దిగుబడి చూపుతున్న రైతు వెంగమునిరెడ్డి

పంట సాగు చేసిన రెండున్నర నెలలకు కోతకొచ్చింది. మొదటి కోతలో 200పెట్టెలు(ఒక పెట్టె 15కిలోలు) వచ్చాయి. రెండో కోతలో 300, మూడో కోతలో 500 పెట్టెల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు 12కోతలకుగాను 4,000 పెట్టెల దిగుబడి వచ్చింది. టమాటాలను కర్ణాటకలోని చింతామని మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించారు. అత్యధికంగా ఒక పెట్టె రూ.1100 నుంచి అత్యల్పంగా రూ.700 వరకు ధరలు పలికాయి. మొత్తం రూ.18లక్షలు రాబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చులుపోనూ రూ.14 లక్షలు మిగిలాయి. ఇంకా 10 కోతలు వస్తాయని, ధరలు బాగుంటే మరో రూ.2 లక్షల వరకు లాభం రావచ్చని రైతు చెబుతున్నారు.

లిల్లీ పూల సాగుతో రోజూ ఆదాయమే


పూలు కోస్తున్న కూలీలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన ఉమేష్, రమేష్ అనే అన్నదమ్ములు లిల్లీ పూలు సాగు చేస్తూ రోజూ ఆదాయం పొందుతున్నారు. ఇద్దరికి నాలుగు ఎకరాల పొలం ఉంది. నాలుగు నెలల కిందట చెరో ఎకరా విస్తీర్ణంలో లిల్లీ పూలు సాగు చేశారు. పూల గడ్డలను జీడిపల్లిలోని ఓ రైతు నుంచి గంప రూ.300 చొప్పున 50 గంపలు తెచ్చి నాటారు. పురుగు మందుల పిచికారీకి నెలకు రూ.5వేలు ఖర్చు చేస్తున్నారు. మొక్కలకు పశువులు, గొర్రెల ఎరువులు వేస్తున్నారు. పొలంలో ఎప్పటికప్పుడు కలుపు తొలగించడంతో పంట ఆశాజనకంగా ఉంది. నెల రోజుల నుంచి పూల దిగుబడి వస్తుంది. ఎకరాకు రోజూ 10 కిలోల చొప్పున వస్తున్నాయని, మార్కెట్లో కిలో ధర రూ.70 పలుకుతున్నట్లు రైతులు చెప్పారు. ఏడాది దాటితే రోజూ 50-80 కిలోల వరకు పూలు వస్తాయని చెబుతున్నారు. పంట కాలం 4-6 ఏళ్ల పాటు ఉంటుంది.

అరటిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

చిట్కా

జిల్లాలో రైతులు సాగు చేస్తున్న అరటి పంటలో అధిక దిగుబడి సాధించాలంటే తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. ప్రతి మొక్కకూ 80 గ్రాముల పొటాష్ ఎరువు వేసుకుంటే ఆకులు పసుపు రంగులోకి మారకుండా కాపాడుకోవచ్చన్నారు. తద్వారా గెల నాణ్యత పెరుగుతుందన్నారు. పంటలో జింకు లోపం కనిపిస్తే వెంటనే మొక్కల మొదళ్లలో 10 గ్రాముల జింక్ సల్ఫేట్ వేసుకోవాలన్నారు. గంధకం, బోరాన్ మిశ్రమాలు సమపాళ్లలో వేసుకోవడం ద్వారా మొక్కలు ఏపుగా పెరిగి కాయ నాణ్యతగా ఉంటుందని శాస్త్రవేత్త తెలిపారు.
- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం


సూక్ష్మపోషకాలు లోపించిన అరటి మొక్క

డీలర్ల ఎన్నిక వాయిదా

రాంనగర్(అనంతపురం) న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల ఎన్నిక ఈనెల 23న జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేయడం జరిగిందని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

చీటీల పేరుతో రూ.కోటి టోకరా

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిపట్టణంలో చీటీల పేరుతో రూ.2 కోట్లు మోసం చేసిన బాలకృష్ణపై సోమవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలకృష్ణ అనేక మందితో చీటీలు వేస్తూ నమ్మకంగా ఉండేవాడు. ఈక్రమంలో ప్రజల నుంచి రూ.కోటి దాకా వసూలు చేసి మోసం చేశాడు. పది రోజుల నుంచి కనిపించకపోవడంతో పట్టణంలోని పలువార్డులకు చెందిన బాధితులు పోలీసులకు ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

కన్నోళ్ల కలలు చెదిరిపోయాయ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

ఆ ఇద్దరూ వేర్వేరు గ్రామాలకు చెందిన యువకులు. ఆ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచారు. అంతకంతకూ ఎదుగుతున్న కుమారులను చూసిన తల్లిదండ్రులు వారిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇక తమకేం భయం లేదని కన్నబిడ్డల్ని చూస్తూ జీవితాలను సాఫీగా సాగిస్తున్నారు. అంతలో విధి చిన్నచూపు చూసింది. రోడ్డు ప్రమాదంలో ఆ ఇద్దరు యువకుల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. కన్నోళ్ల ఆశల కోటలు కళ్లముందే కూలిపోయాయి. ఈ హృదయ విదారక ఘటన ఆ కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చింది.


శేషాద్రి


గంగరాజు

రొద్దం, న్యూస్‌టుడే : రొద్దం ఎస్సీ కాలనీకి చెందిన శేషాద్రి (23) తన చెల్లికి విజయవాడ రైలు తప్పిపోవడంతో ఆమెను తీసుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఇదే సమయంలో కోగిర గ్రామానికి చెందిన గంగరాజు (19) విధుల్లో భాగంగా కియా పరిశ్రమకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ఆ రెండు వాహనాలు ఆదివారం రాత్రి ఎల్ జీబీనగర్ వద్ద ఎదురుపడి వేగంగా ఢీకొన్నాయి. ఈఘటనలో శేషాద్రి(23) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. గంగరాజు(19) తీవ్రంగా గాయపడటంతో బంధువులు పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృత్యువాతపడ్డాడు. గంగరాజు తన తల్లిదండ్రులకు నలుగురు కుమార్తెలు కాగా ఇతనొక్కడే కుమారుడు. శేషాద్రి కన్నోళ్లకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. చేతికొచ్చిన పిల్లలు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. గంగరాజు తండ్రి గంగప్ప అనారోగ్యంతో అనంతపురం ఆసుపత్రిలో 20 రోజులుగా చికిత్సపొందుతున్నారు. కుమారుడి మరణం అతన్ని మరింత కుంగదీసింది. ఈ ఘటనపై రొద్దం ఎస్ఐ నరేంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష


ముద్దాయిని జైలుకు తరలిస్తున్న పోలీసు

అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే: రాంగ్ కాల్‌తో పరిచయం.. వివాహేతర సంబంధంగా మారింది. పరిచయమైన 31 రోజులకే హత్యకు దారి తీసింది. ఈ ఘటన కుడేరు మండలం ఉదిరిపికొండ ప్రాంతంలో చోటు చేసుకుంది. కేసు విచారణ చేపట్టిన జిల్లా కోర్టు నిందితుడు రుద్రేష్‌కు యావజ్జీవ శిక్షను విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది. కేసు పూర్వపరాలు ఇలా.. కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన రుద్రేష్ ఎంఏ పూర్తి చేశాడు. భార్య పార్వతి బీఈడీ పూర్తి చేసింది. ఇద్దరూ కళ్యాణదుర్గంలో ట్యూషన్స్ చెప్పుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకరోజు రుద్రేష్ ఫోన్‌కు రాంగ్ కాల్ వచ్చింది. ఆ ఫోన్ చేసింది విజయలక్ష్మి. ఈమెకు వివాహమైంది. టీటీసీ చదువుతోంది. ఇలా రాంగ్ కాల్‌తో పరిచయమై వాట్సప్ సందేశాలు, అశ్లీల ఫొటోలు పంపుకొన్నారు. ఈ వ్యవహారం కాస్త వివాహేతర సంబంధం దాకా వెళ్లింది. 'నేను భర్తను వదిలేసి వస్తాను. నీవు నీ భార్యను వదిలేసిరా' ఇద్దరూ పెళ్లి చేసుకుందామని ఒత్తిడి పెంచింది. లేదంటే అశ్లీల ఫొటోలు, మెసేజ్‌లు పోలీసులకు ఇచ్చి కేసు పెడతానని బెదిరింపులకు దిగింది. దీంతో రుద్రేష్ మానసిక సంఘర్షణకు గురయ్యాడు. 2018 నవంబరు 5న అనంతపురం వచ్చారు. ఇద్దరూ కలసి ద్విచక్ర వాహనంపై కూడేరు మండలం ఉదిరిపికొండ శివారులోని కొండల్లోకి చేరుకున్నారు. ముందుగానే అనుకున్నట్లు రుద్రేష్ విజయలక్ష్మి గొంతుకు చున్నీతో బిగించి ఊపిరి ఆడకుండా చేసి బండరాయిని తలపై వేసి కిరాతకంగా చంపాడు.

ఆభరణాలు అపహరించి...

హత్య అనంతరం రుద్రేష్ ఆమె ఒంటిపై ఉన్న నగలను అపహరించి కళ్యాణదుర్గంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టాడు. వచ్చిన డబ్బుతో భార్యకు నల్లపూసల దండకు బంగారు నగల దుకాణంలో ఆర్డరు ఇచ్చాడు. ఎల్ఈడీ టీవీ కొనుగోలు చేశాడు. మరోపక్క విజయలక్ష్మి కనిపించకపోవడంతో ఆమె భర్త అనంతపురం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. రెండు రోజుల తర్వాత ఉదిరిపికొండ ప్రాంతంలో విజయలక్ష్మి మృతదేహం బయట పడింది. దీంతో కూడేరు పోలీసులు నిందితుడు రుద్రేష్‌పై హత్య కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ప్రసాద్‌రావు కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ హరినాథరెడ్డి వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో యావజ్జీవ శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు.

రాయదుర్గం
• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

'మాధవ్‌కు మతిభ్రమించింది'

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగం విడి రాజకీయాల్లోకి వచ్చి.. ఇప్పుడు ఏమి లేకపోవడంతో మతిభ్రమించి కూటమి ప్రభుత్వంపై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అసభ్య పదజాలంతో మాట్లాడటం నీచమైన చర్య అని కళ్యాణదుర్గం తెదేపా మండల కన్వీనర్ వెంకటేశులు విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లపై అసభ్య పదజాలంతో మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. దీంతో మండల కన్వీనర్ స్పందించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైకాపా కేవలం హిందూపురం ఎంపీగా గెలిచి నేడు అధికారం లేకపోవడంతో నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా ఆరోపణలు చేస్తే నామినేటెడ్ పోస్టులు వస్తాయని రాజకీయ లబ్ధి కోసమే మాట్లాడుతున్నారనేది ప్రజలకు తెలుసన్నారు. ఇప్పటికైనా ప్రవర్తన మార్చుకోవాలని, లేకపోతే ప్రజలు సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఇంటర్ విద్యార్థిని దుస్సాహసం!

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండలంలోని ఓ విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని ఇంటికి వెళ్లాలన్న ఆలోచనతో భవనంపై నుంచి ప్రహరీ మీదకు దిగేటప్పుడు కింద పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తన స్నేహితులందరూ ఇతర కళాశాలల్లో చదువుతున్నారు. వారితోనే చదువుకోవాలన్నది ఆమె ఆలోచన. దానికి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించక పోవడంతో ఇక్కడ చేర్పించారు. దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థిని కుటుంబ సభ్యులు కళాశాలలో వదిలివెళ్లారు. అక్కడ ఉండటం ఇష్టం లేని విద్యార్థిని కాసేపటికే గ్రౌండు ఫ్లోర్‌పై నుంచి వెనుకాల కిటికీ మీదుగా ప్రహరీపైకి దిగి పారిపోడానికి యత్నిస్తుండగా కాలు జారి కిందికి పడిపోయింది. సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి ఎలాంటి గాయాలు కాలేదని నిర్ధారించారు. ఈ ఘటనపై ఎంఈవో విచారించినట్లు తెలిసింది.

నీరిలా.. విధులెలా

● అధ్వానంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం



కార్యాలయ ఆవరణలో నిలిచిన వరదనీరు

రాయదుర్గం: పట్టణంలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యాలయం గత రెండు నెలలుగా వరదనీటిలో ఉండటంతో ఉద్యోగులు విధులు నిర్వహించడానికి భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కార్యాలయ ఆవరణలోకి వరద నీరు రెండు అడుగుల మేర చేరింది. 2022లో కురిసిన భారీ వర్షాలకు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఉన్న ప్రధాన కాలువ ప్రహరీ కూలడంతో వరదనీరు చేరుతోంది. ఉద్యోగులు, సిబ్బంది బండ రాళ్లు వేసుకుని కార్యాలయంలోకి వెళ్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ముంపు ప్రాంతంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఇటీవల వర్షాలకు నెమ్ము చేరి గోడలు తడిసిపోయాయి. దీంతో ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెచ్చులూడుతున్నాయ్.. జరభద్రం

● ప్రమాదకరంగా ఆర్టీసీ బస్టాండు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా మారాయి. కళ్యాణదుర్గంలోని ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం [illegible] పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ప్రయాణికులు కూర్చునే చోట, కంట్రోల్ గదిపై భాగాల్లో పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. కండెక్టర్లు, డ్రైవర్లు విశ్రాంతి తీసుకునే ప్రత్యేక గది వర్షానికి కారుతోంది. పలుసార్లు అక్కడ పనిచేస్తున్న వారిపై చిన్నచిన్న పెచ్చులూడి పడగా ప్రమాదం నుంచి తప్పించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పైకప్పులు అధ్వానంగా ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉద్యోగులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం రామచంద్రను వివరణ కోరగా.. పైకప్పులు పెచ్చులూడిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామని, అనుమతులు వచ్చిన వెంటనే చేయించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



ప్రయాణికులు కూర్చునే ఆవరణంలో ఇలా..

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: పోలేపల్లి ఎస్సీ కాలనీలో రహదారిపై మురుగు నిల్వతో అధ్వానంగా మారింది. **- వెంకటేశులు**

సమాధానం: పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం **- నందకిశోర్, ఎంపీడీవో**

సమస్య: పాలవెంకటాపురం నుంచి ఎస్.కొండాపురం గేట్ వరకు రహదారి గోతులు ఏర్పడి ఇబ్బందిగా ఉంది. **- నాగేంద్ర**

సమాధానం: మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం **- విజయకృష్ణ, పీఆర్ ఏఈ**

సమస్య: పట్టణంలోని లక్ష్మీబజారులో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. **- రఫీక్**

సమాధానం: వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్**

సమస్య: పట్టణంలోని గోడ గడియారం వద్ద చెత్తచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉంది. **- స్థానికులు**

సమాధానం: తొలగింపు చర్యలు తీసుకుంటాం. **- రవీంద్ర- శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: పట్టణంలోని కేబీ ప్యాలెస్ ప్రాంతంలోని ఖాళీ స్థలంలో మాంసపు వ్యర్థాలను వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. **- మల్లికార్జున**

సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం. **- రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

- బ్రహ్మసముద్రం, రాయదుర్గం, న్యూస్‌టుడే

దుర్గంలో ఫాగింగ్ పనులు



స్ప్రేయింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

రాయదుర్గం, న్యూస్‌టుడే: దోమల నివారణకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం ఫాగింగ్, స్ప్రేయింగ్‌లు చేపట్టారు. సోమవారం 'ఈనాడు' దినపత్రికలో 'దుర్గంపై దోమల దండయాత్ర' అనే కథనానికి స్పందించిన ప్రజారోగ్యశాఖాధికారులు వెంటనే ఫాగింగ్, స్ప్రేయింగ్‌లు చేయించారు. పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు పనులు చేపట్టారు.



సిద్ధేశ్వర కాలనీలో కిందపడిన విద్యుత్తు తీగ

కాలనీలో సమస్యలు పరిష్కరించండి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని సిద్ధేశ్వర కాలనీలో గత రెండు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదని భాజపా జిల్లా కార్యదర్శి నాని, మీనాక్షి, శారదలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్తు తీగలు తెగి కిందపడిన పట్టించుకునే వారే కరవయ్యారని ఆరోపించారు. వర్షాకాలంలో విపరీతమైన చెట్లు పెరిగి విషపురుగులకు నిలయంగా మారాయన్నారు. కొండ పక్కన కాలనీ ఉండటంతో రాత్రిళ్లు ఎలుగుబంట్లు, చిరుత పులులు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. కాలనీలో కాలువలు లేకపోవటంతో దోమలకు నిలయంగా మారిందని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. కాలనీలో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కులవివక్షపై చర్యలకు వినతి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రంలోకి ఎస్సీ, ఎస్టీ పిల్లలను రానివ్వకుండా కులవివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సభ్యులు రామాంజనేయులు, మోహన్ తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌ఛార్జి ఆర్డీవో వినూత్నకు అర్జీ అందజేశారు. బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కులవివక్ష పాటించిన సూపర్‌వైజర్, కార్యకర్త, ఆయాలను విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఇంటి యజమానిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని కోరారు.

అక్రమ కట్టడం కూల్చివేత

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ దగ్గరుండి కూల్చివేశారు. సోమవారం ధర్మవరం రోడ్డులో వెంకటేశులు అనే వ్యక్తికి సంబంధించిన ఇంటి నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు నిలిపివేసి పొక్లెయిన్‌తో కూల్చివేయించారు. అనాధికారికంగా ఇంటి నిర్మాణం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సదరు స్థలం యజమానికి నోటీసులు ఇచ్చిన బేఖాతర్ చేసి నిర్మాణాలు చేపట్టారని, దీనిపై అనేక ఫిర్యాదులు అందాయన్నారు. పోలీసుల సహకారంతో తొలగిస్తున్నామన్నారు.

త్వరలో రైల్వే సేవలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలోనే ప్రజలకు రైల్వే సేవలందుతాయని రైల్వే డిప్యూటీ సీఎస్ శ్వేత అగర్వాల్ అన్నారు. ఏఎస్‌టీఈ సురేష్, డీఎస్ టీఈ నవీన్, స్టేషన్ మేనేజరు ధర్మతేజతో కలిసి సోమవారం ఆవులదట్ల, కళ్యాణదుర్గం, కదిరిదేవరపల్లి, దొడ్డగహళ్లి స్టేషన్లకు పూజలు చేశారు. ఈ ప్రాంతంలో నూతన స్టేషన్లు, సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయనుండటంతో ఏడాది కిందట రాకపోకలు సాగించే రైలు ఆగిపోయిందన్నారు. త్వరలోనే స్టేషన్లల్లో ఉద్యోగులు, సిబ్బందిని నియమించి సేవలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆయా స్టేషన్ల పరిధిలో ట్రైల్ రన్‌లో భాగంగా రైలును నడిపారు. గతంలో ఉన్న రైలు రాకపోకలు పునః ప్రారంభమవుతాయని వివరించారు.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కణేకల్లు, న్యూస్‌టుడే: గ్రామాలాభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మాల్యంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో శ్రీనివాసులు, తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనందరాజు, ప్రభాకర్, శరభనగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం గ్రామీణం: మండలంలోని టి.వీరాపురంలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కాలవ శంకుస్థాపన చేశారు. సర్పంచి ఓబుళమ్మ, ఎంపీటీసీ రాజమ్మ, నాయకులు గంగాధర్ శెట్టి, గంగప్ప, సుంకన్న, గంగాధర, ఎంపీడీవో కొండన్న, ఈఓఆర్డీ మురళీకృష్ణ, పీఆర్డీఈ సుధాకర్‌నాయక్, జేఈ మునిస్వామి, ఏపీవో విజయభారతి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. మండలంలో 83 పనులకు రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తెదేపా మండల కన్వీనర్లు బలరామిరెడ్డి, హనుమంతరెడ్డి, తెదేపా నాయకులు మల్లికార్జున, నారాయణస్వామి, పయ్యావుల అనిల్, మల్లికార్జున, కేశవరెడ్డి, నవీన్, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీవో దాసనాయక్, పీఆర్డీఈఈ సుధాకర్ నాయక్, ఏఈఈ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మండల తెదేపా కన్వీనర్ ధనుంజయ పేర్కొన్నారు. 'పల్లె పండగ' ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని జంబుగుంపల, కుందుర్పి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీడీవో బాలాజి, తెదేపా నాయకులతో కలిసి భూమి పూజలు చేశారు. పశువులకు గోకులం షెడ్లు, పండ్లతోటల పెంపకం పనులు ప్రారంభించారు.



కణేకల్లు: మాల్యంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తెదేపా నాయకులు



ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు

భక్తిశ్రద్ధలతో యల్లమ్మ జాతర

ముప్పలకుంట (బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: మండలంలోని ముప్పలకుంటలో సోమవారం యల్లమ్మ జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలోని ఉత్సవమూర్తులకు వివిధ రకాల పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి డప్పువాద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండల కేంద్రానికి చెందిన కూలీ బాబు (32) కర్నూలులో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. మూడ్రోజుల కిందట మండలంలోని ములకలేడు వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అనంతపురం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దుర్గంలో భారీ వర్షం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లన్నీ జలమయం కావడంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాత తపాలా కార్యాలయం, మేడా వీధి, పాత బస్టాండు తదితర ప్రాంతాల్లో వర్షపునీరు పెద్దఎత్తున ప్రవహించాయి. ఇంటి వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు పూర్తిగా మునిగిపోయాయి. ఆటోలు, జీపులు ప్రధాన రహదారిలో నీటిలో వెళ్తూ మధ్యలో ఇరుక్కుపోయాయి.

రాయదుర్గం గ్రామీణం: రాయదుర్గం నియోజకవర్గంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. 74ఉడేగోళం, మల్లాపురం చెరువులు పూర్తిస్థాయిలో నిండటంతో మరవలు పారాయి. వజ్రవన్నూరు వద్ద వర్షపునీరు వంకలో ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. వరి, వేరుసెనగ, మొక్కజొన్న, టమాటా, మిరప, ఉల్లి పంటలు దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు.



కళ్యాణదుర్గం గ్రామీణం: జలమయమైన ప్రధాన రహదారి

దస్త్రాల పరిశీలన

పాలవెంకటాపురం (బ్రహ్మసముద్రం): మండలంలోని పాలవెంకటాపురం సచివాలయంలో సోమవారం మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ వైద్య బృందం సచివాలయంలో వైద్యసిబ్బంది నిర్వహించే దస్త్రాలను పరిశీలించారు. 2021 నుంచి 2024 మధ్య కాలంలో ఆర్‌సీహెచ్ దస్త్రాలు, గర్భిణులు, చిన్నపిల్లలకు సంబంధించిన ఎంసీహెచ్ కార్డులను పరిశీలించారు. ప్రతి గర్భిణి సుఖమైన కాన్పు జరిగేలా శ్రద్ధ చూపాలన్నారు.

కాలనీలకు పయ్యావుల కేశవ్ పేరు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని కొలిమి, రాయంపల్లి దారిలో ఉన్న జగనన్న కాలనీలను పయ్యావుల కేశవ్ కాలనీలుగా మార్పు చేస్తూ, వాటికి ఆ పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. సోమవారం సర్పంచి లలితమ్మ అధ్యక్షతన పంచాయతీ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఆ కాలనీలకు మంత్రి పయ్యావుల కేశవ్ పేరు పెట్టాలని తెదేపా మద్దతు వార్డు సభ్యులు ప్రతిపాదించారు. దీనిని వైకాపా మద్దతు సభ్యులు వ్యతిరేకించారు. అధికారులు ఓటింగు నిర్వహించగా ఆయన పేరుకు మద్దతుగా 10 మంది సభ్యులు నిలువగా, వ్యతిరేకంగా 8 మంది నిలిచారు. పాలకవర్గం తీర్మానాన్ని ఆమోదించింది. పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

బెళుగుప్ప, న్యూస్‌టుడే : మండలంలోని శీర్పి గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ కూడలిలో ఉన్న వాల్మీకి విగ్రహానికి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

అనంతపురం(కమలానగర్): తన కుమార్తె పెళ్లి విషయంలో అదనపు కట్నం కోసం ఇబ్బందులు పెడుతున్నారని వజ్రకరూరు మండలం, కడవలకుంట గ్రామానికి చెందిన మేరమ్మ ఎస్పీ జగదీష్‌కు విన్నవించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన కుమార్తెను కూడేరు మండలం, ఇప్పేరు గ్రామానికి చెందిన తిరుమలేష్‌కు ఇచ్చి జులై 24న నిశ్చితార్థం చేసుకున్నామని, అడిగినంత కష్టం ఇచ్చినా.. ఇంకా కావాలని పెళ్లికి నిరాకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తప్పదా నరక ప్రయాణం?

ఉరవకొండ నుంచి నెరమెట్ల మీదుగా బొమ్మనహాళ్ వెళ్లే ప్రధాన రహదారి శిథిలమైంది. ఈ దారిలో పదికి పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఉరవకొండ పట్టణం నుంచి మండలంలోని రాయంపల్లి వరకు 8 కి.మీ. దారి మొత్తం అడుగడుగునా గుంతలు పడటంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఆ దారి మరమ్మతులకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మండల ఇంజినీరింగ్ అధికారి రవీంద్ర దృష్టికి తీసుకెళ్లగా.. దారిని పరిశీలించి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**



రోడ్డెక్కిన ముళ్లపొదలు

మండలంలోని తిమ్మసముద్రం - మంగళకుంట గ్రామాల మధ్య ప్రధాన రహదారిన ముళ్లపొదలు కప్పేశాయి. దీంతో రోడ్డు కనిపించక ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముళ్లపొదలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం



ప్రభుత్వాస్పత్రి కిటకిట



ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. కాలానుగుణ వ్యాధులు బారిన పడి చికిత్స కోసం వచ్చిన రోగులతో సోమవారం ఆసుపత్రి రద్దీగా కనిపించింది. ఓపీ సేవలకు 500 మందికి పైగా రోగులు వచ్చారు. గత పది రోజులుగా జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది. వర్షాలు కురుస్తుండడంతో వాతావరణ మార్పులతో పాటు దోమల వ్యాప్తి అధికమైంది. దీంతో రోగుల సంఖ్య కూడా పెరుగుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రద్దీగా కనిపిస్తున్నాయి.



కళ్యాణదుర్గం గ్రామీణం: అమరులైన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీఐ, సిబ్బంది



రాయదుర్గం గ్రామీణం: నివాళులర్పిస్తున్న సీఐ జయనాయక్

పోలీసు అమరులకు నివాళి

కళ్యాణదుర్గం గ్రామీణం, రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సేవలు ఎనలేనివని కళ్యాణదుర్గం పట్టణ సీఐ వెంకటరమణ, రాయదుర్గం యూపీఎస్ జయనాయక్ పేర్కొన్నారు. సోమవారం పోలీసు సంస్మరణ దినం సందర్భంగా అమరవీరుల స్తూపానికి గౌర వందనం చేశారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీ

● ముగ్గురికి తీవ్ర గాయాలు

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కూడేరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. కూడేరుకు చెందిన దామోదర్, ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన అశోక్, నెల్లూరుకు చెందిన వినోద్ ముద్దలాపురం సమీపంలోని సుజలాన్ కంపెనీలో పని చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వారు వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని శివరాంపేట వద్ద జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం అనంతపురం తరలించారు. వీరిలో అశోక్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వరిపైరుకు తెగుళ్లు

● ఆందోళనలో రైతులు



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

కణేకల్లు, న్యూస్‌టుడే: తెగుళ్లు, చీడపీడలతో హెచ్చెల్సీ ఆయకట్టులో వరి రైతులు బెంబేలెత్తుతున్నారు. ప్రతికూల వాతావరణ ప్రభావం కారణంగా గత ఆరో రోజులుగా మబ్బులు కమ్ముకొని వరిపైరుపై తీవ్ర ప్రభావం చూపడంతో పంట దెబ్బతింటోందని ఆందోళన చెందుతున్నారు. వరి పైరు ప్రస్తుతం పట్టుదశలో ఉంది. వాతావరణ ప్రభావంతో పచ్చపురుగుతో పాటు అగ్గి తెగులు సోకి పైరు రంగు మారుతోంది. వేలాది రూపాయలు వ్యయం చేసి మందులు కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నారు. తమ వ్యాపార స్వలాభాపేక్ష కోసం దుకాణదారులు అవసరం లేని మందులను అంటగట్టుతున్నారని రైతులు వాపోతున్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో రైతులకు చేరేలా సలహాలు సూచనలు అందించాలని, అనవసర మందుల విక్రయాలను కట్టడి చేసేలా దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెట్టుబడులు అధికం

మూడెకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. పచ్చపురుగు, అగ్గి తెగులు లక్షణాలు పైరులో కనిపించడంతో మందులు పిచికారీ చేశా. ఎకరాకు ఒకసారి మందు పిచికారీ చేయాలంటే రూ.3 వేలకుపైగా వ్యయం చేయాల్సి వస్తోంది. గణనీయంగా పెరిగిన మందుల ధరలు రైతులకు ఆర్థిక భారంతో పాటు పెట్టుబడి మోపెడవుతోంది.

- రైతు సురేష్, 43ఉడేగోళం

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని నాగమంజుల, గైడ్, సైన్సు ఉపాధ్యాయుడు బండి శ్రీనివాసులు సోమవారం పేర్కొన్నారు. ఈనెల 17న బెంగళూరులో టాటా విండ్ పవర్, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పునరుత్పాదక శక్తి వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించాయి. సైన్స్ నమూనాలు, క్విజ్, పోస్టర్ మేకింగు విభాగాల్లో పది రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనగా, తమ పాఠశాల నుంచి పది మంది పాల్గొన్నట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన జ్యోతిర్మయి, తనుశ్రీ, స్వప్న, అరవిందస్వామి అనే విద్యార్థులు హైబ్రిడ్ స్ట్రీటు లైటింగ్, సోలార్ అగ్రికల్చర్ స్ప్రేయింగ్ రోబోటును ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ ఏడాది డిసెంబరులో దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఆ సంస్థల అధికారులు ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

ఉత్తర కాలువకు సాగునీరు విడుదల



పామిడి, న్యూస్‌టుడే : రైతుల బాగోగుల కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సోమవారం గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల జలాశయం నుంచి ఉత్తర కాలువకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నీరు విడుదల చేయడంతో పామిడి, పెద్దవడుగూరు మండలాల్లోని 13,400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు చేరుతుందన్నారు. పామిడి తెదేపా బాధ్యుడు గుమ్మనూరు ఈశ్వర్, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

మౌలిక సదుపాయలు కల్పించాలి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలోని వార్డుల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతూ సోమవారం సీపీఐ కార్యకర్తలు, నాయకులు పురపాలిక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కాలనీల్లో చెత్తకుండీలు లేవన్నారు. అనంతరం కమిషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు రామదాసు, మధు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

కళాశాలపై చర్యలకు డిమాండ్ : జేసీ

తాడిపత్రి : తాడిపత్రి పట్టణ పరిసరాల్లో ఉన్న సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పురపాలక ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో గతంలో ఒకరి స్థానంలో ఒకరు పరీక్షలు రాశారని, దీనికి యాజమాన్యం సహకరించిందన్నారు. అక్రమాలపై నాక్ బృందం దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవన్నారు. అక్రమాలపై డీఎస్పీ రామకృష్ణుడు, ఇంటిలిజెన్స్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కాలువల ఆధునికీకరణ అవసరం

గుంతకల్లు : తుంగభద్ర ఎగువ కాలువకు ఆధునికీకరణ పనులతో పాటు హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు ప్రభుత్వం వెంటనే చేపట్టాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా నాయకుడు గోవిందు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, మహమ్మద్ గౌస్, మహేశ్, ఈశ్వరయ్య, మణి పాల్గొన్నారు.

ఆగిన ప్రగతి పనులు

➡ ముందుకు రాని గుత్తేదారులు
➡ మురుగుతున్న నిధులు

గుత్తి, తాడిపత్రి, న్యూస్‌టుడే : పురపాలికల్లో ప్రగతి పనులు పడకేశాయి. 15వ ఆర్థిక సంఘం నిధులను రెండేళ్ల కిందట విడుదల చేసినా ఇప్పటికీ పనులు పూర్తి చేయడం లేదు. గుత్తేదారులు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా రూ.కోట్ల నిధులు మురుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువలు లేక జనం అవస్థ పడుతున్నారు. తాగునీటి సౌకర్యం లేక కాలనీల వాసులు అల్లాడుతున్నారు. ప్రజలు పైపులైన్ల విస్తరణ కోసం నిరీక్షిస్తున్నారు.

గుత్తి, తాడిపత్రి పురపాలికల్లో కాలువలు, సీసీ రహదారుల సమస్య తీవ్రంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో పనులు మంజూరు కావడంతో ప్రజలు తమ కష్టాలు తీరుతున్నాయని సంబరపడ్డారు. ఆ సంబరం కొన్నాళ్లకే ఆవిరైంది. ప్రధానంగా రెండు పురపాలికల్లో అంతర్గత రహదారుల్లేక జనం అవస్థ పడుతున్నారు. శివారు కాలనీల్లో పనులు చేపట్టేందుకు పురపాలిక అధికారులు అప్పట్లోనే పరిపాలన, సాంకేతిక అనుమతులు పొందారు. ఆయా పనులు అరకొరగా పనులు జరిగాయి.

గుత్తిలో..: పాత సీపీఐ కాలనీ, వైఎస్సార్ విగ్రహం వద్ద కాలువ, అమృత్ థియేటర్ వెనక దళిత వాడలో రహదారులు వేశారు. కమేలావీధిలో కాలువ, తాగునీటి పైపులైన్‌ను విస్తరించారు. గుత్తికి దాదాపు 97 పనులు మంజూరు కాగా కేవలం 13 మాత్రమే పూర్తి చేశారు. రహదారులు వేసిన చోట కాలువల నిర్మాణం మరిచారు. వీరారెడ్డి, మార్కండేయ కాలనీ, కొత్త సీపీఐ కాలనీ, తోళ్ల షాపుకాలనీ, కొత్తపేట, నేమితాబాదు, లచ్చానిపల్లిరోడ్డు, చెట్నేపల్లిలో పరిస్థితి అధ్వానంగా ఉంది.

తాడిపత్రిలో...: తాడిపత్రి పురపాలికలోనూ ప్రగతి పనుల పరిస్థితి అధ్వానంగా ఉంది. నిధులున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పనులు మంజూరై రెండేళ్లు కావడంతో అప్పటి ఎస్ఎస్ఆర్ ధరలకు ఎవరూ పనులు చేసేందుకు రావడంలేదు. స్టీలు, సిమెంట్ ధరలు పెరగడమే కారణమని తెలుస్తోంది తాడిపత్రికి 63 పనులు మంజూరు కాగా అధికారులు కేవలం 13 పనులు పూర్తి చేయించారు. టీచర్స్ కాలనీ, జయనగర్, సీపీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రగతి పనులు పడకేశాయి.

రెండు పురపాలికల్లో పనుల పరిస్థితి

పురపాలిక	మంజూరైన పనులు	నిధులు(రూ.కోట్లలో)	జరిగిన పనులు
గుత్తి	97	రూ.12	13
తాడిపత్రి	63	రూ.24	13



ఇటీవల గుత్తిలోని జకనీమాత ఆలయానికి వేసిన రోడ్డు

మళ్లీ టెండర్లు పిలుస్తాం

15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రగతి పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకురావడం లేదు. అందుకే మళ్లీ టెండర్లు పిలుస్తాం. పనులు జరిగితే పట్టణంలో అభివృద్ధి కనిపిస్తుంది. **-జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి**

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లు హనుమేష్‌నగర్ 20వ సచివాలయం లైను ఏరియాలో చెత్త సేకరణ జరగడం లేదు. కుండీ ఏర్పాటు చేయాలి. **- రామ్‌తుల్లా**
సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం.
- తబ్సుమ్, శానిటీరీ కార్యదర్శి, 20వ సచివాలయం
సమస్య: నార్పలలోని దుగుమర్రి రోడ్డు కాలనీలో చర్చి దగ్గర రోడ్డుపై మురుగు పారుతోంది. **-నారాయణస్వామి**
సమాధానం: సమస్య పరిష్కరిస్తాం. **- శైలజారాణి, ఈవోఆర్డీ**
సమస్య: తాడిపత్రి శ్రీనివాసపురంలోని ఖాళీ స్థలాల్లో భారీగా వర్షపునీరు, మురుగు చేరుతోంది. **- రమణయ్య, స్థానికుడు**
సమాధానం: సమస్య పరిష్కరిస్తాం. **- వేణుగోపాల్‌రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**
– న్యూస్‌టుడే,గుంతకల్లు పట్టణం, నార్పల, తాడిపత్రి

పోలీసుల త్యాగాలు వెలకట్టలేం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రామకృష్ణుడు, సీఐ ఈరన్న, లయన్స్ సభ్యులు

యాడికి, న్యూస్‌టుడే : సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ ప్రాణాలను సైతం అర్పించేది ఒక్క పోలీసేనని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సోమవారం యాడికి మండలం రాయలచెరువులో లయన్స్ క్లబ్, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సీఐ ఈరన్న, లయన్ క్లబ్ సభ్యులు చల్లా సూర్యనారాయణ, కులశేఖర్, రవికుమార్‌రెడ్డి, ఇస్మాయిల్, రవిప్రసాద్, మంజునాథ పాల్గొన్నారు.



గుంతకల్లు : పోలీసు అమరవీరుల స్తూపానికి పుష్పగుచ్ఛాన్ని సమర్పిస్తున్న ఆర్పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ



పెద్దవడుగూరు : అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న పోలీసులు



గుంతకల్లు : రైల్వే ఎస్పీ కార్యాలయ ఆవరణలో..



బుక్కరాయసముద్రంలో... ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, కమాండెంట్ ప్రభుకుమార్

అమరవీరుల సేవలు అజరామరం

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి, గుత్తి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణను ప్రజాప్రతినిధులు, ఏపీఎస్పీ బెటాలియన్, పోలీస్‌స్టేషన్ల పరిధిలో డీఎస్పీ, సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లు ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల సేవలను గుర్తు చేసుకున్నారు. అమరవీరుల స్తూపాలకు పుష్పగుచ్ఛాలు సమర్పించి అంజలి ఘటించారు **-న్యూస్‌టుడే బృందం**

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. సీపీఐ మహాసభల్లో భాగంగా పెద్దవడుగూరులో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రేమ పేరుతో మోసం

యల్లనూరు(పుట్లూరు), న్యూస్‌టుడే : వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఓబులేసు ప్రేమ పేరుతో ఓ యువతిని మోసగించాడు. అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొంటానని నమ్మించాడు. నాలుగు రోజుల కిందట యువతి పెళ్లి చేసుకోవాలని నిలదీయడంతో నిరాకరించాడు. యువతి పెళ్లి చేసుకోవాలని తల్లిదండ్రులతో కలిసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని వరాలతోట పెన్నావంతెనపై ఆదివారం రాత్రి నరేష్ అనే యువకుడు ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని అనంతపురం పెద్దాసుపత్రికి తీసుకెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

చౌడేశ్వరీ ఆలయంలో చోరీ

పుట్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధి నారాయణరెడ్డిపల్లి గ్రామంలోని చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో సోమవారం చోరీ జరిగింది. ఆలయ తలుపులు పగలగొట్టి రూ.10వేలు నగదు, రెండు జతల ఇత్తడి దీపాలను అపహరించారు. చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

గొర్రెల దొంగ అరెస్టు

శింగనమల, న్యూస్‌టుడే: చిన్న జలాలపురం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున గొర్రెలను అపహరించుకొని వెళ్తుండగా పోలీసులు వెంబడించారు. బొలెరో వాహనం నుంచి 8 గొర్రెలను కిందకు వదిలేసి వెళ్లిపోయారు. కాపరులు 8 గొర్రెలను సంబంధించిన ఆనవాళ్లను చూపించి తీసుకెళ్లవచ్చని సీఐ కౌలుట్లయ్య తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల జప్తు

తాడిపత్రి, న్యూస్‌టుడే : పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను జప్తు చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మదన్, నాగార్జున, మహేష్ అనే వ్యక్తులు పెన్నానది నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని జప్తు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా కన్వీనర్ నాగభూషణం, కృష్ణారెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సభలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలను పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రీసర్వే ఉప తహసీల్దార్ దివాకర్ అన్నారు. మండల పరిధిలోని జంబుళదిన్నె, ఓబుళాపురం గ్రామాల్లో సోమవారం రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

పెద్దవడుగూరు: ముప్పాలగుత్తికి చెందిన రంగస్వామిపై బూర్నాకుంటకు చెందిన చెన్నకేశవ దాడి చేసి గాయపరచడంతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. కేసు విచారణ నిమిత్తం సోమవారం తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణయ్య రెండు గ్రామాలకు వెళ్లి బాధితులతో మాట్లాడి విచారణ చేపట్టారు. సీఐ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం సహాయ నిధి

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిస్తున్న ఆర్థిక సాయాన్ని రోగులు వైద్యం కోసం మాత్రమే ఖర్చు పెట్టుకోవాలని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం అన్నారు. 13 మంది రోగులకు ఆయన సోమవారం క్యాంపు కార్యాలయంలో రూ. 6.16 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు.

విభేదాలు వీడి కలిసికట్టుగా సాగుదాం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

రాంనగర్ (అనంతపురం),శింగనమల, న్యూస్‌టుడే : ఇది వరకు అవగాహన లేకనో.. అనుభవం లేకనో.. అప్పటి పరిస్థితుల బట్టి చిన్నచిన్న సమస్యలతో ఎవరికీ వాళ్ల పనిచేశామని, మీ అందరి ఆశీర్వాదంతోనే నేను మీముందు ఎమ్మెల్యేగా గెలిచాను. నేనెప్పుడూ నాయకులు, కార్యకర్తల సహకారాన్ని మరచిపోనని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం అరవిందనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెదేపా సభ్యత్వంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనమంతా ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. ఎవరిపైనా తనకు వ్యతిరేక భావం లేదన్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలందరూ అన్నీ మరచిపోయి కలిసికట్టుగా పార్టీ కోసం ముందుగా సాగాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

సమస్యలుంటే పరిష్కారానికి కృషి : సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అనంతపురం క్యాంపు కార్యాలయంలో తెదేపా సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం ఉందని కొందరు నాయకులు, కార్యకర్తలకు తరలివచ్చారు. కొందరు న్యాయం జరగడం లేదని ఎమ్మెల్యే ఎదుట అసంతృప్తి వ్యక్తం చేశారు. బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు, నార్పల మండలాలకు చెందిన ఒక వర్గం నాయకులు జిల్లా తెదేపా కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్‌తో సుమారు 2 గంటల పాటు చర్చలు జరిపారు. ఎమ్మెల్యేతో ఫోన్లో మాట్లాడారు. ఎమ్మెల్యే పార్టీ కార్యాలయానికి వెళ్లి నాయకులందర్నీ క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి అందరం కలిసి పనిచేద్దామని కోరారు. చిన్నచిన్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు తప్పకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కేశవరెడ్డి, ఆలం వెంకటనరసానాయుడు, రామలింగారెడ్డి, అశోక్, వెంకటేశ్వరనాయుడు పాల్గొన్నారు.

చిట్టి బుర్రలకు మేత



‘ఈనాడు’ ఆధ్వర్యంలో పాతగుంతకల్లులోని విజ్ఞాన్‌జ్యోతి పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, సామాజిక మాధ్యమాలు- విద్యార్థుల ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన ముస్రత్, విమల, శశిరేఖలకు ప్రధానోపాధ్యాయిని సుమతి, ఇన్‌ఛార్జి ఆంజనేయులు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు షాహీన్, శర్మస్, తదితరులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, గుంతకల్లు**



విజ్ఞాన వికాసం



‘ఈనాడు’ ఆధ్వర్యంలో తాడిపత్రిలోని ఎస్ఎస్ఎస్ ఎంఆర్ఎం పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, సామాజిక మాధ్యమాలు- విద్యార్థుల ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన నిరంజన్ నాయక్, గ్రేస్ కిజియా, జయదీప్‌నాయక్‌లకు ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, తాడిపత్రి**



రోడ్డుపై రెండు అడుగుల గుంత

నార్పల మండల పరిధిలోని తాడిపత్రి- ధర్మవరం ప్రధాన రహదారిలో బి.పప్పూరు గ్రామం దగ్గర భారీ గుంత పడింది. ఈ దారిలో సిమెంటు, బండరాళ్ల లారీలు అధిక లోడుతో రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రెండు అడుగుల గుంత పడింది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నార్పల**



ఇంటి గోడపై మృత్యుపాశాలు



తాడిపత్రిలోని శ్రీరాములపేటలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్తు స్తంభం లేకుండా ఇంటిగోడపై ఇనుప పైపు అమర్చి తీగలు ఏర్పాటు చేశారు. ఇవి కాస్త ప్రమాదకరంగా ఉండడంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ వీరాంజనేయరెడ్డిని వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. **-న్యూస్‌టుడే, తాడిపత్రి పట్టణం**

కదలని మురుగుతో తిప్పలు

తాడిపత్రిలోని శ్రీనివాసపురంలో మురుగు కదిలే దారి లేక ప్రజలు అవస్థపడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా నెలల తరబడి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఏళ్లుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ తేజను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. **-న్యూస్‌టుడే, తాడిపత్రి పట్టణం**



ఇందిరమ్మ కాలనీల్లో సమస్యల మోత

● సీసీ రహదారులు, కాలువలు కరవు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డు, శ్రీనల్లమల సుంకులమ్మ ఆలయం వెనుక వైపుల ఇందిరమ్మ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి.

● కాలనీలో 2006-07లో అప్పటి ప్రభుత్వం ఇళ్ల పట్టాలిచ్చింది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. జనాభా పదివేలు దాకా ఉంటుంది. రాళ్లగుట్ట నేలలు కావడంతో పాదచారులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఒక సీసీరోడ్డు కూడా నిర్మించలేదని లేదని స్థానికులు పేర్కొంటున్నారు.



కాలనీలో ఓ వీధిలో మట్టి రహదారి

కట్టెలే విద్యుత్తు స్తంభాలు

ఆలయం వెనకాల విద్యుత్తు స్తంభాలు లేకపోవడంతో కట్టెలు పాతి గృహాలకు విద్యుత కనెక్షన్లు తీసుకున్నారు. వర్షం వస్తే కట్టెలు కిందపడిపోతున్నాయి. వినియోగదారులు నెలనెలా విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నారు.

ప్రతిసారీ డబ్బులు ఇవ్వాలి

- ఉలిగమ్మ, స్థానికురాలు

12ఏళ్ల కిందట ఇంటిని నిర్మించుకున్నాం. ఇప్పటికి విద్యుత్తు స్తంభాలు లేవు. కట్టెలు పాతుకొని విద్యుత కనెక్షన్లు తీసుకున్నాం. విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నాం. గాలివానకు కర్ర కిందపడితే తిరిగి పాత తీగలు లాగడానికి రూ. 600లు ఇస్తున్నాం. ప్రతిసారి డబ్బు ఇవ్వాల్సి వస్తోంది. స్తంభాలు పాతి సమస్య పరిష్కరించాలి.



కాలనీలో కట్టెల ఆధారంగా లాగిన విద్యుత్తు తీగలు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం

ఇందిరమ్మ కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా సీసీరోడ్ల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. పనులు మంజూరు కాగానే మొదలు పెడతాం.

ఇబ్బందులుంటే చెప్పండి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పురపాలికలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాతకోట కాలనీలో సోమవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. తెదేపా నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక



వి.తీక్షణ్‌సాయి

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: డిసెంబరులో జరగనున్న జాతీయ స్థాయి పాఠశాల క్రీడల అండర్-14 రైఫిల్ షూటింగ్ పోటీలకు జిల్లా నుంచి తీక్షణ్‌సాయి ఎంపికయ్యాడు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల పోటీల్లో ఈ క్రీడాకారులు చక్కటి ప్రతిభ పాటవాలు ప్రదర్శించాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ బాలుడు ఓ ప్రైవేటు అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. పాఠశాల క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తాచాటడంతో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. డిసెంబరులో భోపాల్ నగరంలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరుపున ఈ బాలుడు ప్రాతినిధ్యం వహిస్తాడు.

ఎస్‌బీవై, జేజేబీవై పథకాల్లో చేరండి

జిల్లా సచివాలయం: ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో వ్యక్తిగత ఖాతాలు కలిగిన ఖాతాదారులు సంబంధిత బ్యాంకుల్లో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన(పీఎంఎస్‌బీవై) పథకాల్లో సభ్యులుగా చేరాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. జేజేబీవైలో 18-50 ఏళ్ల వయసు కలిగినవారు అర్హులు. దీనికి రూ.436 ప్రీమియం చెల్లించాలి. ఎస్‌బీవై పథకంలో చేరడానికి 18-70 ఏళ్ల వయసు కలిగినవారు అర్హులన్నారు. దీనికి ప్రీమియం రూ.20 చెల్లిస్తే చాలన్నారు. రెండింటికి ఏకకాలంలో రూ.456 చెల్లించి ఆ రెండు బీమా పథకాల్లో చేరాలని తెలిపారు. ఈ రెండు పథకాల ఉపయుక్తంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈనెల 15 నుంచి 2025 జనవరి 15వ తేదీ దాకా జన సురక్షా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

నగరంలో భారీ వర్షం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఇటీవల ఐదారు రోజులు ఎడతెరపిలేకుండా వర్షాలు కురవగా రెండు రోజులు విరామం ఇచ్చిన వరణుడు మళ్లీ ప్రతాపం చూపాడు. రాత్రి 11 గంటలకు మొదలైన వాన 1 గంట వరకు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. నగరంలోని ఎస్కేయూ, శారదానగర్, కలెక్టరేట్, సప్తగిరి సర్కిల్, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి.

వసతి గృహం పరిశీలన

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ వసతి గృహం పరిశీలించారు. సోమవారం నగరంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ ప్రభుత్వ వసతి గృహం-2ను తనిఖీ చేశారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో కీర్తి గడించాలని..



కృష్ణ కీర్తన

గుత్తి పట్టణానికి చెందిన రాఘవేంద్ర, శ్రావణిల కుమార్తె జి.కృష్ణకీర్తన పేదరికాన్ని జయించి తైక్వాండోలో ఉన్నత శిఖరాలను అధిరోహించింది. తండ్రి లారీ డ్రైవరైనా కూతురుని అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు. గత ఏడాది హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. జూనియర్ ఇంటర్ చదువుతున్న ఈ బాలిక రైల్వే కోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల అండర్-19 పోటీల్లో స్వర్ణ పతకంతో మెరిసింది. ఈ ప్రతిభ ఆధారంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. భవిష్యత్తులో అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించాలన్నదే తన చిరకాల కోరికని కీర్తన తెలిపింది.

పేదింటి బిడ్డలు.. తైక్వాండోలో మెరుపులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పేదరికం వెక్కిరిస్తున్నా.. యుద్ధకళలో ఉన్నత స్థానాన్ని చేరుకోవాలన్నదే ఆ ఇద్దరు బాలికల ఆరాటం. ఇప్పటికే రెండు పర్యాయాలు జాతీయస్థాయి పతకాలతో మెరిసినవీరు మరోసారి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో జరగనున్న పాఠశాల క్రీడల అండర్-19 తైక్వాండో పోటీలకు అర్హత సాధించారు.

మరోసారి జాతీయ స్థాయికి ఎంపిక

తైక్వాండో కిక్‌లతో ప్రత్యర్థులను చిత్తుచేస్తున్న ఇద్దరి బాలికలదీ గుత్తి పట్టణమే. అక్కడే సాయి తైక్వాండో అకాడమీలో ఓనమాలు దిద్దిన ఈ బాలికలు జాతీయస్థాయిలో పతకాలు సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు.

జిల్లాకు తొలి బంగారు పతకం..



ఎస్.కరిష్మాకు యుద్ధకళలంటే ఎంతో ఇష్టం. తండ్రి రసూల్ ఆటో చోదకుడు కాగా తల్లి సమీనా గృహిణి. వీరికి ముగ్గురు అమ్మాయిలు. కరిష్మా జాతీయ, రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అద్భుతమైన ప్రతిభ పాటవాలు ప్రదర్శించి పతకాలు సాధించింది. గత ఏడాది పుదుచ్చేరిలో జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకుంది. జాతీయ పోటీల్లో జిల్లాకు తొలి బంగారు పతకం అందించిన క్రీడాకారిణిగా రికార్డు లిఖించింది. తాజాగా రైల్వే కోడూరులో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల పోటీల్లో పసిడి పతకం సాధించి మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జూనియర్ విభాగంలో గతంలో రెండు పర్యాయాలు జాతీయస్థాయి పోటీల్లో రజత పతకాలు చేజిక్కించుకుంది. ఒలింపిక్స్ క్రీడల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్నదే తన లక్ష్యమని కరిష్మా తెలిపింది.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005 రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: రుద్రంపేట పంచాయతీ పరధి మథర్ థెరీసా కాలనీలో వర్షం కారణంగా ప్రధాన రహదారి గుంతలు ఏర్పడటంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. **- చెన్నకేశవ**

సమస్య: శ్రీనగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో రహదారి గుంతలు మయంగా మారడంతో ఇబ్బందులు వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- ముత్యాలప్ప**

సమాధానం: మదర్‌థెరీసా కాలనీ, శ్రీనగర్‌కాలనీలో గుంతలు ఏర్పడిన రహదారులకు మరమ్మతులు చేపడతాం. **- హిదయతుల్లా, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: గుల్జార్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయం దాటిన అనంతరం మురుగు కాలవ అధ్వానంగా ఉండటంతో నీరు కదలడం లేదు. **- ప్రకాశ్**

సమాధానం: పూడిక తీసి మురుగు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం.

సమస్య: హౌసింగ్ బోర్డులో ఖాళీ నివాసాల వద్ద చెత్త పేరుకుపోయి విష సర్పాలు వస్తున్నాయి. **- నరసింహులు**

సమాధానం: చెత్తను శుభ్రం చేస్తాం

(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు.) **- న్యూస్‌టుడే, రుద్రం పేట, అశోక్‌నగర్**

ఐటీఐలో ప్రవేశాలు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో మిగిలిన సీట్లకు 5వ విడత ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ రామమూర్తి తెలిపారు. ఈ నెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న ప్రభుత్వ, 30న ప్రైవేటు ఐటీఐల ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

విద్యార్థుల ప్రతిభ

జేఎన్‌టీయూ: అమ్మపేరు మీదుగా ఒక మొక్క అనే అంశంపై నెహ్రూ యువకేంద్రం వారు నిర్వహించిన పోటీల్లో ఐటీఐ విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. వక్తృత్వ పోటీల్లో ఉష, చిత్రలేఖన పోటీల్లో నాగమణి బహుమతులు సాధించారు.


ఉత్తమ కళాకారుడిగా ఓబులేశు



రాప్తాడు: రాప్తాడు మండలం చాపట్ల గ్రామానికి చెందిన ఎనుమల ఓబులేశు ఉత్తమ కళాకారుడు, సామాజిక వేత్త అవార్డు పొందారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా శ్రీప్రగతి ఫౌండేషన్ వారు ఈనెల 20న ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర ఫంక్షన్‌హాల్‌లో బంగారు నంది అవార్డు అందజేశారు.



రుద్రంపేట బైపాస్ వద్ద వంతెన మీద విభాగినిపై విద్యుత్తు దీపాలు వెలగక చీకట్లు..



తపోవనం నుంచి కళ్యాణదుర్గం బైపాస్ వంతెన పైన విద్యుత్తు దీపాల పరిస్థితి..

జాతీయ రహదారిపై చీకట్లు

అనంతనగరం పరిధిలో దాదాపు సోమలదొడ్డి నుంచి కక్కలపల్లి వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఈ 10 కిలోమీటర్ల దూరంలో మూడు పైవంతెనలు ఉన్నాయి. నగర పరిధిలో ఉండటంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. నిత్యం పగలు రాత్రి తేడా లేకుండా జాతీయ రహదారిపై ప్రయాణాలు చేసే వాహనాలు మాత్రమే కాకుండా నగరవాసులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రహదారిలో ఉన్న విద్యుత్తు దీపాల నిర్వహణ అధ్వానంగా మారటంతో చీకట్లు అలముకుంటున్నాయి. ముఖ్యంగా ఆయా వంతెనలపై ఉన్న విద్యుత్తు దీపాలు వెలగకపోవటంతో హెడ్‌లైట్ల వెలుగుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. విద్యుత్తు దీపాలను మరమ్మతులు చేస్తే ప్రమాదాల నివారణకు ఆస్కారం ఉంటుంది. **- చిత్రాలు: ఈనాడు, అనంతపురం**

అంతర్ కళాశాలల పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్ హవా

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్కేయూ అనుబంధ అంతర్ కళాశాలల గ్రూప్-బి క్రీడాపోటీల్లో ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల జట్టు మరోసారి హవా కొనసాగించింది. బాస్కెట్‌బాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఈ కళాశాల జట్లు ఛాంపియన్‌గా నిలిచాయి. సోమవారం చివరిరోజు జరిగిన కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. కబడ్డీలో వరుసగా మూడోసారి ఎస్ఎస్‌బీఎన్ కళాశాల జట్టు టైటిల్ అందుకోవడం విశేషం. చిరకాల ప్రత్యర్థి ఆర్ట్స్ కళాశాల జట్టుపై ఎస్ఎస్‌బీఎన్ జట్టు భారీ విజయం సాధించడంతో కళాశాలలో సంబరాలు చేసుకున్నారు. పెద్దఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు జరిపారు. మూడు పోటీల్లోనూ ఎస్ఎస్‌బీఎన్ జట్టు ఛాంపియన్ కాగా.. బ్యాడ్మింటన్, కబడ్డీలో ఆర్ట్స్ కళాశాల రెండోస్థానం సాధించింది. బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎస్కేయూ జట్టు రెండోస్థానం సాధించింది. మూడురోజులుగా జరిగిన ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఎస్కేయూ క్రీడామండలి కార్యదర్శి జెస్సీ, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రాజు, వ్యాయామ అధ్యాపకుడు ప్రసాద్‌లు హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు.



కబడ్డీ విజేత ఎస్ఎస్‌బీఎన్‌కు ట్రోఫీ అందజేస్తున్న జెస్సీ

రేపు అంగన్‌వాడీ అభ్యర్థులకు ఇంటర్వ్యూ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసిన అర్హత కలిగిన అభ్యర్థినులు ఈనెల 23న ఉదయం 10 గంటలకు అనంత ఆర్డీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని అనంత అర్బన్ సీడీపీఓ చల్లా లలిత తెలిపారు. అనంత అర్బన్, గ్రామీణం, శింగనమల, నార్పల, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టులోని కూడేరు మండలం పరిధిలో అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. అర్హత కలిగినవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని రావాలి. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా సాగుతుంది. దళారుల మాటలు ఎవరూ నమ్మవద్దన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఏసీబీ లేదా తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు.

పోలీసుస్టేషన్ల చుట్టూ తిప్పించుకోకండి: ఎస్పీ

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: బాధలు, సమస్యలతో వచ్చే ప్రజలను పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పించుకోకుండా సకాలంలో సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 80 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారుల సమస్యలు విని ఆయా పరిధిలోని పోలీసు అధికారులతో అక్కడే ఫోన్‌లో మాట్లాడారు. చట్ట ప్రకారం ఉన్న సమస్యలను సకాలంలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ రమణమూర్తి పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్ణీత తేదీల్లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇన్‌ఛార్జి కమిషనరు రామలింగేశ్వర్ తెలిపారు. 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు తప్పనిసరిగా కొత్తగా ఆధార్ నమోదు చేయించాల్సి ఉంటుంది. ఎవరైనా మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఈనెల 22న రాణినగర్ ఆషా ప్రాథమిక పాఠశాల, హమాలీ కాలనీ వార్డు సచివాలయం, 23న గాంధీ బజారులోని నంబరు-2 పాఠశాల, హమాలీ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల, 24న పాతూరులోని 15వార్డు పాఠశాల, బుడ్డప్పనగర్‌లోని రాజేంద్ర నగరపాలకోన్నత పాఠశాల, 25న గాంధీ బజారులోని కస్తూరిబా పాఠశాల, నంబరు-1 పాఠశాల, నవోదయకాలనీలోని రహమత్ నగరపాలక పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.



పుస్తకం ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

యువ కవులతో సాహిత్యానికి జీవం

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: యువ కవులు మరింతమంది వస్తేనే సాహిత్యానికి పదికాలాలపాటు జీవం ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని కేఎస్ఎన్ మహిళా కళాశాలలో యువ కవి శీర్పి చంద్రశేఖర్ రచించిన గొంతు తెగిన అక్షరం పుస్తకం ఆవిష్కరించారు. పుస్తకంతో పలువురిలో చైతన్యం నింపవచ్చు అన్నారు. సత్యాన్ని అక్షరాలతో ఇంకొంత మందికి తెలియజేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త షేక్ నబీ రసూల్, కవి కొత్తపల్లి సురేష్, చంద్రశేఖర్, అంకె శ్రీనివాస్, రాధేయ, పోతుల రాధాకృష్ణ, బండి నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఇంటర్ ప్రవేశాలు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇన్‌ఛార్జి డీఈవో కృష్ణయ్యకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరానికి ఇప్పటి నుంచే కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రవేశాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆయా విద్యాసంస్థల నిర్వాకంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హనుమంతరాయుడు, మంజునాథ్, ఉమామహేష్, వంశీ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి జయంతి వేడుకలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో సోమవారం వాల్మీకి జయంతిని వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకొని పూజలు చేశారు. పార్టీలకు అతీతంగా పెద్దఎత్తున వాల్మీకులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి వాల్మీకులందరూ ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని సూచించారు. సాయంత్రం ప్రధానవీధుల్లో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు.

పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. డీఈవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో విలీనం అయిన పురపాలక ఉపాధ్యాయులకు కూడా అన్ని నిబంధనలు వర్తింపజేయాన్నారు. పురపాలక ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారులుగా నియమించాలన్నారు. కోటేశ్వరప్ప, రాఘవేంద్ర, రమణయ్య, సరళ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల శిబిరానికి వాలంటీర్ల ఎంపిక

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ముందస్తు గణతంత్ర పదసంచలన శిబిరానికి ఎస్కేయూ, జేఎన్‌టీయూల నుంచి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఎంపిక ప్రకియ సోమవారం జేఎన్‌టీయూలో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు మురళీధర్‌రావు, శారద ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. వాలంటీర్ల ఎత్తు, పరుగు, కవాతు ప్రదర్శన, శారీరక దృఢత్వం, వ్యక్తిత్వ వికాసం, సాంస్కృతిక ప్రదర్శన తదితర పరీక్షలు చేశారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయ అభ్యర్థులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీలో ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌వర్మ, ప్రధాన కార్యదర్శి అంజనయ్య విజ్ఞప్తి చేశారు. టెట్ పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక ఉపాధ్యాయులు సోమవారం నిరసన కార్యక్రమం చేశారు. నూతన ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ దస్త్రంపై సంతకం చేశారు. అయితే ఇందులో ప్రత్యేక ఉపాధ్యాయుల ఉద్యోగాలు భర్తీ చేయలేదని అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రత్యేక టెట్ నిర్వహిస్తున్నా, ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో గంగాధర్, ప్రశాంత్, ఇంతియాజ్, రవికుమార్, లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.





వ్యాసరచనతో సృజనాత్మకత

ఎస్కేయూ, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయడానికి దోహదపడతాయని రఘు సైనిక్ పాఠశాల డైరెక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. సంగమేష్‌నగర్‌లోని రఘు సైనిక్ పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభాలు- నష్టాలు', 'సామాజిక మాధ్యమాలు.. విద్యార్థులపై ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి చరణ్‌రామిరెడ్డి ప్రథమ, అశ్రిత ద్వితీయ, 8వ తరగతి విద్యార్థి లాస్య తృతీయ స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. పాఠశాల డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్, లోకేష్ విజేతలకు బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ


విభేదాలు వీడి కలిసికట్టుగా సాగుదాం

రాంనగర్ (అనంతపురం): ఇది వరకు అవగాహన లేకనో..అనుభవం లేకనో.. అప్పటి పరిస్థితుల బట్టి చిన్నచిన్న సమస్యలతో ఎవరికీ వాళ్లు పనిచేశామని, మీ అందరి ఆశీర్వాదంతోనే నేను మీముందు ఎమ్మెల్యేగా గెలిచాను. నేనెప్పుడూ నాయకులు, కార్యకర్తల సహకారాన్ని మరిచిపోనని ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలో అరవిందనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెదేపా సభ్యత్వంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలందరూ అన్నీ మరచిపోయి కలిసికట్టుగా పార్టీ కోసం ముందుగా సాగాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే : గంగ : వీక్షణం, **గాయత్రి :** మార్టిన్, **గౌతమి :** జనక అయితే గనక, **గౌరి, ఎస్వీ సినిమాక్స్ :** దేవర, **తరంగిణి :** విశ్వం, **తేజస్విని :** లవ్‌రెడ్డి, **త్రివేణి, నీలిమ :** వేట్టయాన్, **సుధా :** ఇద్దరు.

నియంత్రికను కప్పేసిన నిర్లక్ష్యం



రుద్రంపేట పంచాయతీ పరిధి 44వ జాతీయ రహదారి రహదారిపై రిలియన్స్ సెల్ టవర్స్ సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక పిచ్చి మొక్కలతో కప్పుకొంది. ఫ్యూజు బోర్డు, తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో అగ్గి రవ్వలు బయటకు వస్తుండటంతో స్థానికులు భయాందోళ చెందుతున్నారు. విద్యుత్తు అధికారులు స్పందించి విద్యుత్తు నియంత్రిక చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే: రుద్రంపేట**

చెత్తకుప్పలు.. రాకపోకలకు ఇబ్బందులు



జాతీయ రహదారి-44 నంబరుపై పరిటాల రవి పెట్రోల్ బంక్ సమీపంలో చెత్త కుప్పలు తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. చెత్త కుప్పలు తొలగించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే: రాంనగర్**

డంపింగ్ యార్డులా ఖాళీ ప్రదేశం



మారుతినగర్‌లో ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. రెండో క్రాస్‌లో చెత్త బిన్ను ఉంది. బిన్ను ఉన్నా ఖాళీ ప్రదేశంలో పలు రకాల వ్యర్థాలు పడేశారు. బిన్నులో ఉన్న చెత్తను మాత్రమే తీసుకెళుతున్నారే గాని కుప్పగా పడేసిన వాటిని తరలించడం లేదు. రోజుల తరబడి ఇలాగే ఉంటున్నా నగరపాలక పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పలు విషపురుగులు అందులో చేరుతున్నాయి. దోమలు పెరగడంతో సీజనల్ వ్యాధులతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- న్యూస్‌టుడే, మారుతినగర్ (అనంత నగరపాలక)**

'హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వం'

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందన్నారు. రాష్ట్రంలో అఘాయిత్యాలు జరుగుతుంటే హోం మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని చెప్పి కనీసం అగ్గిపెట్టె కూడా ఇవ్వలేదన్నారు. పింఛన్లు తొలగిస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఘోరంగా దెబ్బతిన్నాయన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.

కార్మికుల కష్టాలపై మొద్దు నిద్ర వీడాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కార్మికుల కష్టాలపై అధికారులు వెంటనే మొద్దు నిద్ర వీడాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌గౌడ్ విమర్శించారు. సోమవారం నగరపాలక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు గత 7 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉండటంతో కార్మికులు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులకు పరికరాలు పూర్తి స్థాయిలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, నగర ప్రధానకార్యదర్శి కృష్ణుడు పాల్గొన్నారు.



నగరపాలక వద్ద బైఠాయించి నినదిస్తున్న జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్‌గౌడ్, కార్మికులు

లద్దాఖ్ జట్టు సంచలన విజయం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాజమాత జిజియాబాయి జాతీయస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గ్రూప్-ఎఫ్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా సోమవారం అనంత క్రీడాగ్రామంలో జరిగిన లీగ్ పోటీలో లద్దాఖ్ జట్టు 2-0 గోల్స్ తేడాతో మధ్యప్రదేశ్ జట్టుపై సంచలన విజయం సాధించింది. తొలి పోటీలో ఒడిశా చేతిలో ఓడిన లద్దాఖ్ జట్టు రెండో పోటీలో పుంజుకుంది. మధ్యాహ్నం ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మరో పోటీ డ్రాగా ముగిసింది. ఈ పోటీ చివరి వరకు ఎంతో ఉత్కంఠగా జరిగింది. రెండు జట్లు హోరాహోరీగా పోరాడినా ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. నిర్ణీత సమయంలో ఒక్క గోల్ కూడా నమోదు కాకపోవడంతో అదనపు సమయం ఆడించారు. అయినా గోల్ మాత్రం కాలేదు. రెండు జట్లు పాసింగ్, డిఫెన్స్‌తో అందరినీ మెప్పించాయి. మంగళవారం ఈ పోటీలకు విరామం. బుధవారం ఈ పోటీలు జరుగుతాయి. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి డేనియల్ ప్రదీప్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నాగరాజులు పర్యవేక్షించారు.



హోరాహోరీగా తలపడిన ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ జట్లు

మద్యం మత్తులో కారుడ్రైవర్ హల్‌చల్

అనంతపురం(కమలానగర్): మద్యం మత్తులో ఓ కారు డ్రైవర్ నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో హల్‌చల్ చేశాడు. సమీపంలో ఇతర వాహనాలు రాకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. జనశక్తినగర్‌కు చెందిన అమీర్‌ఖాన్ సాయి చందన డ్రైవింగ్ స్కూల్ కారుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం మద్యం తాగి టవర్‌క్లాక్ వద్ద దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో కారు ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి సమీపంలోని సివిల్ సప్లై గిడ్డంగి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. పాపంపల్లికి చెందిన వెంకటేష్ ఆత్మకూరుకి వెళ్లేందుకు రోడ్డుపై ఉన్నాడు. కనగానపల్లి మండలం మద్దలచెరువుకి చెందిన రాంచరణ్ తన మిత్రుడితో కలసి ఆటోలో ఆత్మకూరుకి వస్తున్నారు. వెంకటేష్ పాపంపల్లి వద్ద ఆటో ఎక్కాడు. ఆత్మకూరు సమీపంలోకి రాగా ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టుని ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.